## ఘనత వహించిన గణశత్రు

సత్యజిత్ రాయ్ గణశత్రు సిన్మాతీయడానికి ముందు నుంచే మంచిపేరు సంపాదించింది. 21వ ఫిల్మ్ ఫెస్టివెల్‌లో కొంత వివాదాన్ని కూడ చోటు చేసుకుంది. బయట థియేటర్లు విడుదల చేయకు ముందు నందన కాంప్లెక్స్‌లో ప్రదర్శించడానికి. డిస్ట్రిబ్యూటర్లు ఒప్పుకోలేదు పిక్చర్ దెబ్బ తింటుందని వారి భయమట. అందుకని 19 నాడు ప్రదర్శించ వల్సిన గణశత్రు చిత్రాన్ని 20 జనవరికి మార్చారు 20 జనవరి నాడే బెంగాల్ అంతట గణశత్రు రిలీజ్ అవుతుంది. ఇది కొంతవరకు పత్రికవాళ్లను, డెలికేటర్సను నిరాశ పరిచింది. ఈ సిన్మాకు ముందు నటీనటులను ప్రతినిధులకు సత్యజిత్ రాయ్ పరిచయం చేసాడు.

ఈ 21వ ఫిల్మోత్సవం అనుకున్నంత బాగా లేదని వచ్చిన ప్రతినిధులు అభిప్రాయపడినారు. 1982లో సత్యజిత్ రాయ్ అందరితో కల్సి తిరిగితే ఈ సారి మృణాల్ సేన్ అందరి మధ్యావున్నను సత్యజిత్ రాయ్ రాకపోవడం అందరిని నిరాశ పరిచింది. అపర్ణాసేన్ తనకు పట్టనట్టుగా ఉండడం కూడ కొందరి విమర్శకు గురయినట్లుగా చెప్పవచ్చు.

## ఇండియన్ పెనొరమ

ఈ సారి ఇండియన్ పెనొరమలో చెప్పుకో దగిన సంఖ్యలో చిత్రాలు రాలేదు. వచ్చిన వాటిలో బి.నరసింగరావు చిత్రం 'దాసి' అపర్ణసేన్ చిత్రం 'సతి' మృణాల్ సేన్ చిత్రం 'ఎక్ దిన్ అచానక్' మెర్వాంజి గుజరాతి చిత్రం 'పెర్సి' చిత్రాలు ప్రేక్షకుల నుండి, సిన్మా, పత్రిక ప్రతినిధులనుండి ప్రశంసలను అందుకున్నాయి. ప్రేమకరంట్ సిన్మా "నక్కల రాజకుమారి" కన్నడ పిల్లల చిత్రం కూడ పత్రికా ప్రతినిధులకు చూపించడం జర్గింది. గిరిష్‌కర్నాడ్ ఈ ఫిల్మోత్సవంలో చాల ఉత్సాహంగా పాల్గొనడమే గాకుండ తాను దర్శకత్వం వహించిన "కనక పురందర" సిన్మా ఇండియన్ పెనొరమలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు.

శిరువోలు రాధాకృష్ణ.

## ఫ్లాష్

సత్యజిత్ రాయ్ జ్యోతిని వెలిగించ డానికి అందాల నటి ధబశ్రీరాయ్ సహాయం తీసుకున్నప్పటికి జ్యోతిని మూడుసార్లు వెలిగించాడు. జ్యోతి వెలుగలేదని కాదు ప్రెస్ ఫొటోగ్రాఫర్లు కోరికపై మూడుసార్లు వెలిగించాడు. దాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా గమనించారు. మెల్లగా నవ్వుకున్నారు.




అనుబంధ నవలిక

# మధ్యతరగతి మందహాసం

రచనః ముద్దంశెట్టి హనుమంతరావు.






అప్పుడే చీకటి పడింది.

ముకుందం, యింట్లో లైటు వెలిగించి వచ్చి, బైట వరండాలో వాలుకుర్చీలో జేరబడ్డాడు.

అతని మెదడులో యేవో ఆలోచనలు స్వైర్య విహారం చేస్తూండటం వల్ల, అస్థిమితంగా అగుపిస్తున్నాడతను.

ముకుందం అంతగా ఆలోచించడానికి, కారణం లేకపోలేదు. స్నేహితుడు సీతారామయ్య, ఉత్తర భారతదేశంలోని పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి వెళ్తున్నాడు. అటువంటి సంకల్పం, ముకుందానికీ చాలా రోజుల్నించి మనసులో తారాడుతోంది. అంచేత, తానూ సీతారామయ్యతో వెళ్ళాలన్న తలంపు వచ్చిందతనికి. తలంపైతే

వచ్చిందిగాని? అవసరమయ్యే పైకం యెలా వస్తుంది? ఇప్పుడతనిలో ఆలోచనల్ని రేకెత్తించిన సమస్య అదే.

అలా ఆలోచిస్తోన్న ముకుందంకి, తన యౌవనపు రోజులు స్మృతి పథంలో మెదిలినయ్... ఆరోజుల్లో, తనకి డబ్బు గురించిన ఆలోచనలే వుండేవిగావు. పూర్వులు గడించి పెట్టిన ఆస్తిపాస్తులుండటం వల్ల, పుష్కలంగా ఖర్చు బెట్టేవాడు. నిజం చెప్పుకోవాలంటే, ఆరోజుల్లో తానే పిల్ల జమిందారులా వుండేవాడు. మేలురకం గ్లాస్కో పంచెగట్టి, మల్లెపూవులాంటి సిల్కులాల్చీ వేసుకుని, సెంటువాసనల ఘుమఘుమలతో ర్యాలీ సైకిలు మీద తిరుగుతూ వుంటే, తనని చూసి చాలామంది అసూయపడేవారు. అయితేనేం –

ఆ అంతస్తూ, ఆ సరదాలూ, యెంతో కాలం నిలవలేదు. అసూయతో కళ్ళుకుట్టుకున్న దాయాదులు, ఆస్తికోసం కోర్టులో కేసు వెయ్యడంతో, క్రమంగా ఆ ఆస్తంతా, హారతి కర్పూరంలా హరించుకుపోయింది. తాను రిటైరయ్యేసరికి, కేవలం తన పెన్షను మీదే ఆధారపడాల్సిన పరిస్థితి యేర్పడింది. సరిగ్గా అదే సమయంలో, కనకరాజుకి వుద్యోగం దొరకడం, నిజంగా తమ కుటుంబ అదృష్టమే మరి! ఇప్పటికీ తనకి అనిపిస్తుంది అసమయంలో అబ్బాయికే గనక వుద్యోగం దొరికి వుండకపోతే, తమ కుటుంబ పరిస్థితి యెంత హీనస్థితికి దిగజారి వుండేదోనని! అట్లాంటి జీవితం గడిపిన తాను యిప్పుడు డబ్బుకోసం ఆలోచించక తప్పడం లేదు .... యిలా సాగుతున్నయ్ ముకుందం ఆలోచనలు.

కనకరాజు, అప్పుడే ఆఫీసునుండి వచ్చాడు. తండ్రి నిరుత్సాహపు ధోరణిని గుర్తించాడు. "ఏంనాన్నా అలా వున్నారు. ఒంట్లో బావుండటం లేదా?" అంటూనే లోపలికి నడిచాడు.

కొడుకుని అనుసరిస్తూనే, లోపలికి వెళ్ళాడు ముకుందం.



తాను యేమిటాలోచిస్తున్నాడో, తన సమస్య యేమిటో కొడుకుతో చెప్పేయాలనుకున్నాడు కాని, మొహమాటం అడ్డొచ్చింది. అందుకే, కృత్రిమమైన ఓ చిరునవ్వు పెదాలపై చిందించాడు.

"అబ్బే! అదేం లేదురా! ఒంట్లో బాగానే వుంది. ఔనూ, మాకోడలు దగ్గర్నించి వుత్తరం యేమీ రాలేదా?" అడిగాడు, మామూలు ధోరణిలో.

"ఇవ్వాళే వుత్తరం వచ్చిందినాన్నా.." అని యింకేదో చెప్పబోయాడు కనకరాజు. కాని, ముకుందం మధ్యలో అందుకున్నాడు.

"అయితే, యెప్పుడొస్తున్నట్టు రాసిందేవిట్రా?" ఆసక్తిగా అడిగాడు.

"త్వరలో వస్తున్నట్టు రాసిందేగాని ఫలానా తేదికి వస్తానంటూ వివరంగా రాయలేదు నాన్నా, ఆడాళ్ళతో యిదే వచ్చిన చిక్కు. కన్నారింటికి వెడితే చాలు... అక్కణ్ణించి తొందరగా రావడానికి మనసొప్పదు వాళ్ళకి." సన్నగా నవ్వుతూనే అన్నాడు కనకరాజు.

కోడలు, త్వరగా వచ్చే అవకాశాలు తక్కువగా వున్నాయని అర్థం చేసుకున్న ముకుందం అంతరంగంలో నిరాశ చోటు చేసుకుంది. అతని మొహంలో, నిరుత్సాహపు ఛాయలు తారాడినాయ్.

"ఎప్పుడూ లేనిది, యీ పర్యాయం లక్ష్మి, వాళ్ళింట్లో చాలా రోజు తిష్టవేసిందిరా అబ్బాయ్. అందుక్కారణం యేమన్నా రాసిందా?" అడిగాడు, ముకుందం.

" రాసింది నాన్నా! వాళ్ళ ఆఖరి చెల్లెలికి సంబంధాలొస్తున్నాయట. బహుశా, యేదో ఒకటి నిశ్చయించేస్తారట కూడాను. అంతవరకూ రాదట".

"అంటే పెళ్ళి జరిగాక వస్తుందా యేవిట్రా?" నిరాశతో అడిగాడు.

"అట్లా రాయలేదనుకోండి. నిశ్చయమైన వరకూ వుంటుందేమో."

ముకుందం, బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

'కోడలు యెప్పుడొస్తుందా అని, వేయి కళ్ళతో నేనెదురు చూస్తుంటే, ఆమెరావడం వాయిదా పడిందన్నమాట. నిజానికి, నా జాతకమే అట్లాంటిది. అనుకున్నదేది సవ్యంగా జరిగి చావదు. ఎప్పుడూ యేదో నిస్పృహ వెన్నంటుతూనే వుంటుంది." నీరసంగా అన్నాడు, ముకుందం.

తండ్రి అలా నిరుత్సాహంగా మాట్లాడ్డం, కనకరాజుకి కాస్తంత బాధ కలిగించింది. తండ్రి మాటల్లోని భావాన్ని, వేరుగా తీసుకున్నాడు. బహుశా, అప్పుడప్పుడూ వంట చెయ్యడానికే, తండ్రి అలా బాధపడుతున్నారేమోనని భావించాడు.

"మీరేవీ బాధపడకండి నాన్నా ఇంతవరకూ వంట చెయ్యడంలో అప్పుడప్పుడూ మీరు తీసుకుంటున్న శ్రమ, యింక మీకు వుండదులెండి. అంతా

నాకు వదిలెయ్యండి. మీరయినా, యీ వయస్సులో యెన్నాళ్ళని చెయ్యికాల్చుకోగలరని?"

నిజానికి, ముకుందం అభిప్రాయం అది కానేకాదు. అప్పుడప్పుడూ వంట చెయ్యడం , పెద్ద సమస్య కాదు. ప్రస్తుత సమస్య, తన తీర్థ యాత్రలకు అవసరమైన డబ్బు. ఆ డబ్బును గురించిన ఆలోచనలే, తనలో అనిశ్చిత పరిస్థితిని కల్పించాయి. అందుకే, వున్నది వున్నట్టు చెప్పేయాలని నిర్ణయించుకున్నాడు, ముకుందం.

"ఒరేయ్ అబ్బాయ్, నువ్వు భావిస్తున్నట్టు, వంట గురించి నేనేం బాధపడ్డం లేదురా. నిజం చెప్పాలంటే, వంట చెయ్యడం, నాకేం శ్రమకాదు ఆడుతూ, పాడుతూ, చేసెయ్యగల్ను. కాని, నా నిరుత్సాహానికి కారణం అది కాదురా." సందేహిస్తూ ఆగిపోయాడు, ముకుందం.

నివ్వెర పోయాడు, కనకరాజు. . తండ్రి అలా సందేహిస్తూ మాట్లాడ్డం, అదే ప్రథమం "మరి, కారణం యేమిటో, చెప్పండి నాన్నా!" ఆసక్తితో అడిగాడు.

"మరేం కాదురా! మన సీతారామయ్య లేడూ, అతడూ మరో యిద్దరు కలిసి ఉత్తర భారతదేశంలోని పుణ్యక్షేత్రాలన్ని సందర్శించడానికి వెళ్తున్నారు. నాకూ అటువంటి అభిలాష వుంది గనక, మళ్ళీ యిట్లాంటి అవకాశం రాదు గనక, వాళ్ళతో పాటు నేనూ రైలు దేరాలనుకుంటున్నాను. కోడలు యింట్లో లేనపుడు, యెలా వెళ్ళడమూ అన్నది ఒక సమస్య... వెళ్ళడానికి అవసరమయ్యే పైకం మరో సమస్య..." యెలాగో విషయాన్ని బైటికి వెళ్ళగక్కాడు, ముకుందం.

కనకరాజు మొహంలో. రంగు మారింది. తాను యెదుర్కోబోతోన్న సమస్య యేమిటో, అతనికి అవగతమయ్యింది. ప్రస్తుతానికి , ఆర్థికంగా తన పరిస్థితి యెలా వుందో, అతనికే తెలుసునుగాని, యితర్లకి అర్థంకాదు.

"మీరు మరేం అనుకోకపోతే, యిప్పట్లో మీ ప్రయాణాన్ని వాయిదా వేసుకోండి నాన్నా.." ముక్తసరిగ చెప్పాడు, కనకరాజు.

ముకుందం మొహం కాస్తంత వాడింది. అతను అంత సులువుగా వదిలిపెట్టే మనిషికాదు. ఏదేనా నిర్ణయాన్ని తీసుకున్నాడూ అంటే, అది అమల్లో పెట్టేవరకూ విశ్రమించడు అంత పట్టుదల గలమనిషి.

"ఇటువంటి సదవకాశం మళ్ళీ యీ జన్మలో రాదురా అబ్బాయ్ సీతారామయ్యతో వెళ్తే, స్వంత మనిషి నాతోపాటు వున్నట్టే వుంటుంది కదా. అదే. నా తాపత్రయమంతాను. మనం అందరం కలిసి ఆ పుణ్యక్షేత్రాలు దర్శించడానికి వెళ్లామనుకోవడం, వూహాకందని విషయం. అయినా, నేను వెళ్ళొచ్చిన యీ కొద్ది రోజులూ నువ్వూ శ్రీనివాస్, ఆమాత్రం వంట చేసుకోలేరా యేమిటి?"

"అది, పెద్ద సమస్య కాదు నాన్నా. వంట చేసుకోలేకపోతే, హోటల్లో భోంచేస్తాం. కానీ..." అని కనకరాజు యేదో చెప్పబోతూ వుంటే ముకుందం చప్పున అందుకున్నాడు.



" అదీ, అలా అన్నావు బావుందిరా అబ్బాయ్. నన్నడిగితే, హోటల్ భోజనమే అద్భుతంగా వుంటుందనుకో నీ వయసులో నేను, మీ అమ్మ వాళ్ళ కన్నారింటికి వెళ్తే, నేనెక్కనాడూ చెయ్యికాల్చుకోలేదు తెలుసా? రోజూకో హోటల్లో భోజనం రుచిచూసి, వెరయిటీ అనుభవించేవాణ్ణి. అదో మధురానుభూతి అనుకో." గతాన్నోసారి గుర్తుకు తెచ్చుకుని, మురిసిపోతూ చెప్పాడు, ముకుందం.

తండ్రి మాటలు వింటుంటే, కనకరాజుకి నవ్వాలనిపిస్తోంది, కాని, నవ్వలేక పోయాడు. తండ్రికి, వయస్సుతో పాటు, యింగితం పెరగలేదనుకున్నాడు.

"ఆ రోజులు వేరు నాన్నా. అప్పటి మీ అంతస్తు వేరు. మీ ఆర్థికస్థితి వేరు. ఇప్పుడు మన అంతస్థులో మార్పు వచ్చింది. ఆర్థికస్థితి కూడా అంతంత మాత్రమే, వైరటీని చవిచూసే స్తోమత లేదు మనకి. ఏదో కాస్తంత కడుపు నింపుకుంటే, చాలనిపించే రోజులు. కాలం మార్పుతో పాటు, మనలోనూ మార్పు రావాలి కదా? అంచేత హోటలు ప్రశ్నేరాదు." బాధ్యత తెలిసిన వ్యక్తిలా చెప్పుకు పోయాడు, కనకరాజు.

ముకుందరావు, చిన్న బుచ్చుకున్నాడు. "సరేలేరా, అవన్నీ యిప్పుడు నెమరు వేసుకుంటే, నాకే బాధనిపిస్తోంది. ఆ విషయం వదిలేయ్. లక్ష్మి వచ్చేవరకూ వంట విషయంలో యెలాగో సర్దుబాటు చేసుకోండి. నేను వెళ్ళేలోపున లక్ష్మి వచ్చేస్తే, గొడవే లేదనుకో, పోతే, నన్ను మాత్రం సీతారామయ్యతో వెళ్ళనివ్వు. ఇటువంటి అవకాశం, యీ జన్మలో నాకు మళ్ళీ అందుబాటుకి రాదు. పెద్ద ఖర్చేమీ వుండదు. ఓ అయిదొందలు యిస్తే యెలాగో సరిపెట్టుకుంటాను. ఈ ఒక్క కోరిక తీరిపోతే, నా జీవితానికో అర్థం, పరమార్థం వుంటుందిరా అబ్బాయ్" అసలు విషయాన్ని బైట పెట్టాడు, ముకుందం.

డబ్బు ప్రసక్తి యెట్లాగో వస్తుందని కనకరాజుకి తెలుసు. అయితే పైకం మొత్తం వినేసరికి, అతనికి 'షాక్' తగిలినట్టయ్యింది. అయిదు వందలిస్తేయెలాగో సరిపెట్టుకుంటానని యెంత తేలిగ్గా అనేశారాయన. ఇంటిపరిస్థితులు ఆయనకి తెలివా? తెలిసి కూడా ఆయన యీ ప్రయాణానికి వుద్యుక్తులవ్వడంలో అర్థం యేమిటి.... అనుకున్నాడు మనసులో కనకరాజు. బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"అయిదు వందలిస్తే చాలని, యెంత తేలిగ్గా చెప్పారునాన్నా, అంత మొత్తాన్ని, నేను అకస్మాత్తుగ యెక్కణ్ణించి తినుకు రాగల్ను చెప్పండి. మా మరదలు పెళ్ళి నిశ్చయం కాబోతున్నదని తెలుసుకుని, ఆ ఖర్చుని యెలా తట్టుకోవాడమా అన్న ఆలోచనల్లో పడిన నాకు, మీ ప్రయాణ సమస్య యెదురయ్యింది. ఏం చెయ్యడమో, నాకేమీ పాలుపోవడం లేదు". విసుగ్గా అన్నాడు, కనకరాజు.

ముకుందం మనస్సు, చివుక్కుమంది. అప్రయత్నంగా, ఆవేశం అతని మనసులో చోటుచేసుకుని, మొహాన్ని రాగరంజితం చేసింది. అయితే, తన ఆవేశాన్ని, అసహనాన్ని, బాహ్యంగా వ్యక్తీకరించలేక, బలవంతంగా

దిగమింగుకున్నాడు.

"నేను పుణ్యక్షేత్రాలు సందర్శించి రావాలనుకోవటం, నీకో సమస్యగా పరిణమిస్తే, అసలు నేను వెళ్ళడమే మానుకుంటాన్రా అబ్బాయ్. కాని, ఒక్క విషయం యేమిటంటే, నేనెప్పుడూ మానాన్నగారి అభిప్రాయాల్ని, అభిలాషల్ని, అణచి వేయడానికి ప్రయత్నించలేదు. ఆయన కోరికల్ని తీర్చడానికే ప్రయత్నించాను. అయినా, నిన్ను అని యేం లాభం, కాలం మారిపోతోంది, కాలంతోపాటు, భక్తి గౌరవాలూ దిగజారిపోతున్నాయ్." అంతర్గతంగా యెంతో బాధపడుతున్నట్టు, నిస్పృహతో అన్నాడు.

తండ్రి, అంత పరుషంగా మాట్లాడుతాడని గాని, మానసికంగా అంతగా బాధపడతాడని గాని, కనకరాజు వూహించలేకపోయాడు. తన అశక్తిని, తెలియజేస్తే, అది ఆయన్ని అగౌరవపరచినట్టు యెలా అవుతుందో, కనకరాజు వూహకి తట్టలేదు. తండ్రి, తనని తప్పుగా అర్థం చేసుకున్నారనిపించింది.

"మీరిలా బాధపడ్డంలో అర్థం లేదునాన్నా. ప్రస్తుత పరిస్థితిని వివరించానంతే. కాలం మారింది గనకనే, అనుకోవల్సి వస్తోంది. మీనాన్నగారి అభిప్రాయాలకి, అభిలాషలకి మీరేనాడు అవరోధ పర్చలేదూ అంటే, అప్పటి పరిస్థితులు మీకు సానుకూలంగా వుండేవి. అప్పటి మీ ఆర్థికస్థితి యెంతో మెరుగ్గా వుండేది. పెద్దలు గడించిపెట్టిన ఆస్తి, మీచేత విచ్చలవిడిగా ఖర్చు పెట్టించింది. మీలో ఆర్థికపరమైన ఆలోచనలకు, యిబ్బందులకు, తావులేకుండా చేసింది. కాని, యిప్పటి మన పరిస్థితులు వేరు, ఆ ఆస్తి లేదు, ఆ అవకాశమూ లేదు. ఈ నిజాన్ని, యింకా విడమర్చి మీకు నేను చెప్పనవసరం లేదనుకుంటాను." తన మాటలు, తండ్రికి కష్టం కలిగించినా, నిజం చెప్పక తప్పదనుకుని చెప్పాడు, కనకరాజు.

అసలే నిస్పృహతో వున్న ముకుందం, కొడుకు మాటలకు మానసికంగా మరింత దెబ్బ తిన్నాడు. అతని మొహం, హఠాత్తుగా, కాస్తంత అరుణిమను పుంజుకుంది. కనుబొమలు ముడిపడ్డాయి. చూపులో తీక్షణత చోటుచేసుకుంది.

"అంటే, పూర్వులు గడించిపెట్టిన ఆస్తిని, నేనే తగల బెట్టానంటావు? అంతేనా, నీ అభిప్రాయం?" విసురుగా అన్నాడు.

కనకరాజు, నివ్వెఱపోయాడు.

తాను అలా అని, తొందరపడ్డాడేమో! పశ్చాత్తాపంతో, అతని హృదయం ముడుచుకు పోయింది.

"క్షమించండి నాన్నా, సందర్భం వచ్చింది గాబట్టి అలా అన్నానేగాని, మిమ్మల్ని నిందించాలనిగాని, నొప్పించాలనిగాని, నా



అభిమతంకాదు." పశ్చాత్తప్తుడై అన్నాడు, కనకరాజు.

ముకుందం, బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

"సరేలేరా అబ్బాయ్, అవన్నీ యిప్పుడెందుగ్గాని, పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి నన్ను వెళ్ళమంటావో, లేదో, ఒక్క ముక్కతో సూటిగా చెప్పు."

గంభీరవదనంతో అడిగాడు, ముకుందం.

ఏం చెప్పాలో, కనకరాజుకి అర్థంకాలేదు. కాని, యేదో ఒకటి చెప్పాలి. మౌనంగా వూరుకుంటే, ఒప్పుకోరాయన... అనుకున్నాడు.

"వెళ్ళొద్దని చెప్పడానికి నాకు నోరు రావడం లేదు నాన్నా, అట్లాగని, మీరడిగిన పైకం యివ్వగలిగే శక్తి కూడా నాకు యిప్పట్లో లేదు. నిర్ణయాన్ని మీకే వదిలేస్తున్నాను. పరిస్థితుల్ని అర్థం చేసుకోండి..." మెల్లగా అన్నాడు. కనకరాజు.

ముకుందం మొహం, యెర్రబారింది. "శక్తి లేదనకురా! పైకం యివ్వాలన్న అభిప్రాయమే వుంటే, అప్పు చేసి అయినా యివ్వొచ్చు. నోరు విడిచి, యెన్నడు అడగనివాణ్ణి నేను అడిగాను. మనస్సుంటూ వుండాలేగాని, ఈ మార్గాలు లేకుండా పోవు. ఏంచేస్తాం? నాదురదృష్టాన్ని తిట్టుకోవాల్సిందే. ఈ జన్మకి, భగవంతుడు నాకు యింతే రాసి పెట్టాడనుకోవల్సిందే.." అనుకుని విసురుగా బైటికి నడిచాడు, ముకుందం.

కనకరాజు, అప్రతిభుడయ్యాడు. అసహనంగా అలా వెళ్ళిపోతున్న తండ్రికేసి చూస్తూ క్షణం వుండిపోయాడు. నిస్సహాయస్థితిలో నిట్టూరుస్తూ, కుర్చీలో కూలబడిపోయాడు.

ఆలోచనలతో, అతని మస్తిష్కం వేడెక్కిపోయింది. ప్రస్తుతం తనెదుట వున్నవన్నీ ఆర్థికపరమైన సమస్యలే. ఈ సమస్యల్ని పరిష్కరించడమెలా? ఆర్థికస్తోమత లేని వ్యక్తి, యెన్ని యిక్కట్లు యెదుర్కోవాలో, యెంతటి మనోవేదనకు గురికావాలో, స్వానుభవంతో యిప్పుడు తెలుసుకుంటున్నాడు కనకరాజు కాని, యేంచెయ్యగలడు?

ఆరోజుల్లో, తాను యింకాపై చదువులు చదివివుంటే, వుద్యోగరీత్యా, మరో మెట్టు పైనే వుండేవాడేమో. అలా జరిగివుంటే, యిప్పటి ఆర్థిక సమస్యలు వుండకపోనేమో? కాని... కాని... అప్పట్లో తన చదువుకి అంతరాయం కలిగింది. అది, తన దురదృష్టం గాకపోతే యింకేవిటి? ... . యిలా ఆలోచిస్తున్న కనకరాజుకి, గతం గుర్తుకొచ్చింది.

* * *

కనకరాజుకి, చిన్నప్పట్నుంచీ బలమైన ఓ కోరిక వుండేది. తనుబాగా చదువుకుని, అందరూ మెచ్చేవిధంగా, యేదేనా వున్నతోద్యోగంలో చేరాలని, ఆ అభిప్రాయంతోనే, యెంతో శ్రమించి, చదువు సాగించాడు. ప్రతిక్లాసులోనూ, 'సెభాష్' అనిపించుకునేవాడు. ఇంటరు పాసయ్యేసరికి, తండ్రి రిటైరవ్వడం,

వున్న ఆస్తి కాస్తా కరిగిపోవడం కారణంగా, చదువుకి అక్కడితో స్వస్తి చెప్పేసి, ఒకనాటి అతని ఆకాంక్షని, అభిలాషని, బలవంతంగా చంపుకున్నాడు.

కొందరు శ్రేయోభిలాషులు, ముకుందం దగ్గరికి వచ్చి, కనకరాజు పై చదువులకోసం సిఫార్సు చేశారు కూడాను.

"మీ అబ్బాయ్ చాలా తెలివైనవాడు, అటువంటివాణ్ణి, పై చదువులు చదివించకుండా, మాన్పించేయడం, విజ్ఞత అనిపించుకోదండీ, పునరాలోచించండి." అని.

అలా సలహా యిచ్చిన వాళ్ళకేసి, ముకుందం కళ్ళెర్రజేసి చూశాడు- వీళ్ళా నాకు సలహా లిచ్చేది? అన్న అహంభావంతో,

" మా అబ్బాయి భవిష్యత్తు మహోజ్వలంగా వుండాలని, నాకు మాత్రం కోరిక వుండదటండీ. అటువంటి కోరిక, యే తండ్రి కోరుకోడు చెప్పండి? కాని, ప్రస్తుతం మా యింటి పరిస్థితులు, అనుకూలంగా లేవు. ఏంజేస్తాం! మావాడివట్ల మీకు గల అభిమానాదరాలకు ధన్యవాదాలు.." అని చెప్పాడు ముకుందం, విసురుగానే.

తమ కుటుంబ పరిస్థితులు, అలా దిగజారడానికి, కొంత వరకూ తనే కారకుడన్నబాధ, అతని మనసులో లేకపోలేదు. అయితే, ఆ బాధని బహిర్గతం చెయ్యలేదు, ముకుందం.

ఆ విధంగా, తన చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టినందుకు, కనకరాజు బాధపడని క్షణం లేదు. కాని, యేం చెయ్యగలడు? పరిస్థితుల ప్రవాహానికి యెదురీద లేకపోయాడు. తన దురదృష్ట జాతకాన్ని తిట్టుకున్నాడు, మనసులోనే.

ఆరోజుల్లో, నిరుద్యోగ సమస్య అంత ప్రబలంగా వుండేదికాదుగనక, తండ్రి పరపతి ఆధారంగా, వెంటనే వుద్యోగం దొరికింది, కనకరాజుకి. అదీ గుమాస్తాగిరియే, ఏదో ఒక వుద్యోగం దొరికిందన్న తృప్తి, తాత్కాలికంగా, మనిషి పెంచుకున్న ఆశలకీ, నిజంగా జరిగిన దానికీ, యెక్కడా పొత్తు వుండదేమోనని పించిందప్పట్లో కనకరాజుకి. ఆ నిరాశా నిస్పృహలు, అతణ్ణి చాలా రోజులు అంటిపెట్టుకుని వుండేవి. క్రమంగా వాటినుంచి విముక్తిపొంది, జీవితంతో రాజీ పడిపోయాడు.

అయితే, కనకరాజుకి ఒక కోరిక మిగిలిపోయింది. తానుపై చదువులు చదవలేకపోయినా తన కొడుకు లయినా కనీసం గ్రాడ్యుయేట్ చెయ్యాలన్నా కృత నిశ్చయానికొచ్చాడు. అయితే, తన ఆకాంక్ష సక్రమంగా నెరవేరుతుందో, లేదోనన్న సందేహం పట్టుకుంది. అందుకనే తన అభిలాషని ఓ రోజు కొడుక్కి తెలియజేశాడు, కనకరాజు.

"ఒరేయ్ శ్రీనూ! బాగా చదువుకుని, మంచి వుద్యోగంసంపాదించాలన్న ఆకాంక్ష నాకు వుండేది ఆరోజుల్లో. కాని, నేను తెలివైన స్టూడెంటునే అయినప్పటికీ, అప్పటి ఆర్థిక పరిస్థితుల వల్ల, యింటరు తర్వాత చదువుని సాగించలేక పోయాను. కనీసం నిన్నయినా గ్రాడ్యుయేట్ చెయ్యాలని నా సంకల్పం. నువ్వు



కష్టపడి చదవాలి. గ్రాడ్యుయేట్వి కావాలి. అదయినా, ఫస్టుక్లాసులో పాసవ్వాలి. ఏదేనా బ్యాంకులో వుద్యోగం సంపాదించాలి."

"శ్రద్ధగానే చదువుతున్నాను కదా నాన్నా" ముక్తసరిగ అన్నాడు, శ్రీనివాస్.

కొడుకు జవాబులో, గట్టిపట్టుదల ద్యోతకమవ్వలేదు కనకరాజుకి. అయినా, ఆశల్ని చంపుకోలేదు. అతనికో-విషయం విచిత్రంగా తోస్తోంది. పిల్లల్ని బాగా చదివించి, వారిని ప్రయోజకుల్ని చెయ్యాలన్న కొందరు తల్లిదండ్రులు ఆశలకు, ఆకాంక్షలకు భిన్నంగా, వారి పిల్లలు శ్రద్ధలేని చదువులు సాగిస్తూ వుంటే, చదువుకోవాలన్న ఆసక్తితో, పట్టుదలతో వున్న పిల్లల్ని చదివించలేని అశక్తికి లోనవుతున్నారు కొందరు తల్లిదండ్రులు... అనుకున్నాడు మనసులో.

ఒకవేపు కొడుకు సమస్య యిలా వుంటే, మరోవేపు తండ్రి, గతవైభవాన్ని విస్మరించలేక, ప్రస్తుత పరిస్థితులతో రాజీపడలేక, యెప్పటికప్పుడే యేదో సమస్య తెచ్చిపెడుతున్నారు. కాని, తాను యేం చెయ్యగలడు. మానసికంగా మథనపడ్డం మినహా... . అనుకున్నాడు, లోలోన కనకరాజు.

* * *

ఓ రోజు వుదయం తొమ్మిది కావస్తోంది. వంట కార్యక్రమంలో హడావిడిగా వున్నాడు, కనకరాజు.

వీథిలో, ఆటో ఆగిన చప్పుడు వినిపించగానే, వడిగా బైటికొచ్చాడు, కనకరాజు.

భార్యలక్ష్మి, కూతురు వసంత, ఆటో దిగుతూ అగుపించారు. కనకరాజు మనస్సు కుదుటబడింది, యిక వంటచేసుకోవాల్సిన బాధ తప్పుతుందని, సామాన్లతో వాళ్ళిద్దరూ లోపలికి వస్తుంటే అన్నాడు.

"ఓ వుత్తరం ముక్కయినా రాయకండా, యింత హఠాత్తుగ వచ్చేసారేంటి లక్ష్మీ?" అని.

లక్ష్మి, సన్నగా నవ్వింది.

"వ్యవధి లేకపోయిందండీ." అంటూ లోపలికి వచ్చి చేతిలో వున్న సూట్‌కేసుని బల్లమీద పెట్టింది, లక్ష్మి. ఆమె వెంట వసంత, కనకరాజు వచ్చారు.

"అన్నట్టు, మా చెల్లాయి పెళ్ళి నిశ్చయమయ్యిందండీ. అబ్బాయి బ్యాంకులో పన్జేస్తున్నాడు. తేదీ కూడా నిశ్చయమయ్యింది. పట్టుమని మరో పాతికరోజులే వ్యవధి వుంది. మళ్ళీ నేను, కాస్త ముందుగా వెళ్ళాలికదా! అందుకనే, యింక జాప్యం చెయ్యకుండా, బైలుదేరి వచ్చేశాను" అంది లక్ష్మి.

"అలాగా"

"మీరేం చేస్తున్నారిప్పుడు" ప్రశ్నించింది, లక్ష్మి.

"ఇంకేముంటుంది, ఏదో, యింత వండుకుని తినాలికదా?"

"మావయ్యగారేరి?"

"బజారుకి వెళ్ళారు. ఈ వృద్ధాప్యంలో, ఆయనకెందుకు శ్రమ కలిగించడమని, అప్పుడప్పుడూ నేనే వంటగదిని పాలిస్తున్నాను." సన్నగా నవ్వుతూ అన్నాడు. కనకరాజు.

లక్ష్మి మనసు చివుక్కుమంది: భర్తకి శ్రమ అధికమయ్యిందని, ఆమె బాధపడిపోతోంది పాపం.

"అందుకనే, అమ్మాయిని వదిలి వెళ్తానంటే, దాన్ని తీసుకెళ్ళమని మీరే బలవంతం చేశారు. అది వుంటే, మీకి శ్రమ తప్పేదిగా?"

"పోనీలే లక్ష్మి అమ్మాయి మాత్రం యెక్కడికి వెళ్ళాలి గనక, అందుకే, తీసుకెళ్ళ మన్నాను. సరేగాని, మీవాళ్ళంతా కులాసాయే గదా!"

"ఆ, బాగానే వున్నారండీ, మానాన్నగారు మీకు వుత్తరం రాస్తామన్నారు. వీలుంటే, స్వయంగా వచ్చి చెబుతామన్నారు. వారంరోజులు ముందుగానే మనల్నందర్నీ పెళ్ళికి రమ్మని చెప్పమన్నారు మీతో.."

"ఇంతకీ, మీ చెల్లెలి పెళ్ళి యెప్పుడు నిశ్చయించారు?".

"వచ్చేనెల మూడో తేదీన, రాత్రి యెనిమిదిన్నరకి.."

"అబ్బాయి యేం చేస్తున్నాడు?"

"చెప్పాను కదండీ, బ్యాంకులో వుద్యోగమని.."

"ఔనుకదూ! మర్చిపోయాను. మీచెల్లాయి అదృష్టవంతురాలే."

"నిజమేనండీ! కాని, మానాన్నగారికి మాత్రం బాగా వదుల్తోంది."

"వదుల్తుంది మరి, బ్యాంకు వుద్యోగులకు డిమాండు అలా వుందిప్పుడు.." నవ్వుతూ అన్నాడు, కనకరాజు.

"సరేగాని, మనం అందరమూ వెళ్ళాలండోయ్ పెళ్ళికి.."

"అందరమూ వెళ్ళాలంటే, యెలా కుదురుతుంది లక్ష్మీ? రైలు టిక్కెట్లకే తక్కువ డబ్బు అవుతుందనుకుంటున్నావా! మానాన్నగారు, అబ్బాయి, వుండిపోతారులే."

"మావయ్యగారు వుండిపోయినా ఫరవాలేదండీ, అబ్బాయిని రానివ్వండి. వాడు మాత్రం యింక్కెడికి వెళ్తాడని?"

కనకరాజు సాలోచనగా ఓ నిశ్వాసం వదిలాడు.

"మన సమస్యలు, రోజురోజుకీ పెరుగుతూనే వున్నాయ్ లక్ష్మి. మీ చెల్లెలి వివాహానికి, మనం వెళ్ళక తప్పదు. వెళ్తే, మొత్తం ఖర్చు యెంతవుతుందో, ఓసారి ఆలోచించు."

భర్త చెప్పిందాన్ని లక్ష్మి, అంతగా పట్టించుకున్నట్టు లేదు. ఆమె ధోరణి ఆమెది.

"మా చెల్లి ముందుగానే చెప్పిందండోయ్.. దానికి హెచ్చెమ్‌టీ వాచీ కొనివ్వాలట. నోరు తెరిచి అడిగింది. ఇవ్వకపోతే బావుండదు. ఖరీదు యెక్కువే అనుకోండి. కాని, ఏం చేస్తాం? మళ్ళీ యివ్వబోతామా యేవిటి? ఆ డబ్బు మనకి బట్టల రూపంలో తిరిగి వచ్చేస్తుంది కూడాను."



కనకరాజు, భార్యకేసి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడేగాని, చప్పున యేవీ సమాధానం చెప్పలేక పోయాడు. ప్రస్తుత పరిస్థితుల్లో, అంత పైకం యెలా వస్తుందా, అన్న ఆలోచన లేకుండా, లక్ష్మి యెంత తేలిగ్గా చెప్పేసింది?,, అనుకున్నాడు, మనసులో.

"ఏవిటండీ అలా చూస్తున్నారు?"

"మనకి అదనంగా అవసరమయ్యే యీ పైకాన్ని, యెక్కణ్ణించి తీసుకురావడమా అని, ఆలోచిస్తున్నాను లక్ష్మి. దీనికి తోడుగా, మా నాన్నగారేమో ఉత్తర భారతంలో తీర్థయాత్రలు జరపడానికి బయల్దేరుతానంటున్నారు. ఆయనకి ఓ అయిదువందలిస్తే చాలంటున్నారు. ఈ పరిస్థితుల్లో యేం చెయ్యడమా అని, ఆలోచిస్తున్నాను. నాకేవీ పాలుపోవడం లేదు." అన్నాడు కనకరాజు.

బాధ్యత గల ఓ యింటి యజమానిగా, అతని బుర్రనిండా ఆలోచనలే.

"మావయ్యగారు మరోసారి యెప్పుడో తీర్థయాత్రలకి వెళ్తారు లెండి. ఆయనతో నేను మాట్లాడుతాను కదా!"

"నువ్వు మాట్లాడుతావు, కానీ, ఆయన అర్థం చేసుకుంటేకదా! అప్పుచేసిఅయినా సరే, కొడుకుగా నా కర్తవ్యాన్ని, బాధ్యతని నిర్వర్తించాలన్న ధోరణిలో ఆయన మాట్లాడుతున్నారు. ఇంకేం చెప్పను?" నిరుత్సాహంగా అన్నాడు, కనకరాజు.

"సరేలెండి, ఇవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. వంట యెందాకా వచ్చింది?" అంటూ వంటగదికేసి దారి తీసింది, లక్ష్మి.

కనకరాజు, వుస్సురనుకుంటూ, కుర్చీలో కూలబడిపోయాడు. అతని మెదడులోని ఆలోచనల్ని అరికట్ట లేకపోయాడు.

వసంత, సామాన్లు సర్దడంలో నిమగ్నమయ్యింది.

* * *

ఆ రోజు ఆదివారం.

కనకరాజు, ఆఫీసుపని చేస్తూ కూచున్నాడు. ఎప్పుడయినా. ఆఫీసు పనిలో ఒత్తిడి అధికంగా వుంటే, అలా యింటికి తెచ్చి కేసులు క్లియర్ చెయ్యడం అలవాటు రాజుకి. అది, తన కర్తవ్యంగా భావిస్తాడు. అంతేకాదు- అధికారుల చేత మాటపడ్డం, అతనికి యిష్టం వుండదు.

శ్రీనివాస్ వీధిలోంచి వచ్చాడు. శ్రీనివాస్‌కి, పందొమ్మిదేళ్ళు మొన్ననే దాటినయ్. గుండ్రని మొహం, కోటేరు వేసిన ముక్కు, పెద్దకళ్ళు.. అబ్బాయ్ అందంగానే అగుపిస్తాడు. కాని, అసహనం పాళ్ళు అతడిలో కాస్త అధికం.

టేబిలు ముందు నుంచున్న శ్రీనివాస్‌ని చూశాడు. కనకరాజు.

"ఏవిట్రా అబ్బాయ్" అన్నాడు మెల్లగా కనకరాజు తనపని తాను చేస్తూనే.

"అసలు నాలాంటివాడు, కాలేజీ చదువులకి వెళ్ళకండా వుండాల్సింది

నాన్న." అసహనంగా అన్నాడు, శ్రీనివాస్.

మేఘాలు లేకుండా, వురిమినట్టనిపించింది, కనకరాజుకి. కొడుకు ప్రవర్తనకి విస్తుపోయాడు. వాడిలో యింత అసహనం, ఆవేశం, యెట్లా వుంజుకున్నాయో, అర్థం కాలేదతనికి. లోలోన బాధపడ్డాడు. రాస్తోన్న కలం మూసేసి, కొడుక్కేసి చూశాడు.

"ఏమయ్యిందిరా యిప్పుడు?" నెమ్మదిగా అడిగాడు.

"అజంతా, ఎల్లోరా గుహలు చూడ్డానికి విద్యార్థులంతా కలిసి వెళ్తున్నామని చెప్పాను కదా నాన్నా! దీనికిగాను ప్రతీ విద్యార్థీ రెండొందల రూపాయలివ్వాలి. అందరూ యిచ్చేశారు గాని, నేనింకా యివ్వలేదు." అన్నాడు శ్రీనివాస్.

కనకరాజు, బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు. కొడుక్కి, చదువుపట్ల లేని శ్రద్ధాసక్తులు ప్రదేశాలు చూడ్డానికి వున్నందుకు, నవ్వొచ్చిందతనికి. అయితే, నవ్వలేకపోయాడు. తండ్రిగా తన బాధ్యత నిర్వర్తించక తప్పదనుకున్నాడు.

"చెప్పాను కదర్రా శ్రీనూ, మరో వారం రోజుల్లో యేర్పాటు చేస్తానని వాళ్ళతో చెప్పు" అన్నాడు, కనకరాజు.

తండ్రి అసహాయతని అర్థం చేసుకో లేకపోయాడు శ్రీనివాస్.

"మనకోసమని వాళ్ళు కార్యక్రమం ఆగిపోదునాన్నా. టిక్కెట్లు కొని, రిజర్వేషన్లు యేర్పాటు చేసుకోవాలా మరి? నిజం చెప్పాలంటే, ప్రతిసారీ యేదో ఒక సాకుచెప్తుండటానికి, నాకే సిగ్గుగా వుంది. మొహం చెల్లడం లేదు కూడాను." బాధపడుతున్నట్టుగా అన్నాడు, శ్రీనివాస్.

కొడుకు మొహంలోకి సూటిగా చూశాడు, కనకరాజు.

"సిగ్గెందుకురా? అవాంఛనీయమైన పనులేమైనా చేస్తే సిగ్గుపడాలిగాని, నిస్సహాయతని తెలుపు కుందుకు సిగ్గెందుకు చెప్పు. కాలేజీలో చదువుతున్న వాళ్ళందరూ యిటువంటి యెక్స్‌కర్షన్లకి వెళ్తున్నారంటావా? పుష్కలంగా డబ్బున్న వాళ్ళే, కాలేజీలో చదువుతున్నారంటావా?"

"డబ్బు లేనపుడు, కాలేజీ చదువులకోసం యెగ్రబాకడం యెందుకు నాన్నా? అందని పళ్ళకోసం అర్రులు చాచినట్టే కదా? హాయిగా, యేదో చిన్న వుద్యోగంలో చేరిపోతే పోలే?"

కొడుకు అభిప్రాయానికి, చిన్నగా నవ్వుకున్నాడు, కనకరాజు. వాడిలో బాగా నిస్పృహ చోటు చేసుకుందనుకన్నాడు.

"అక్కడే నువ్వు పొరబడుతున్నావురా శ్రీనూ! కాలేజి చదువులు, కేవలం సరదాలు తీర్చుకోవడానికి మాత్రమే కాదని,గుర్తుంచుకో. జీవితానికో స్థాయిని కల్పించుకోడానికి, ఈ రోజుల్లో, వుద్యోగాలు దొరకడం కూడా అంత సులువుకాదు. పెద్దపెద్ద చదువులు చదువుకున్న వాళ్ళెంతో మంది, నిరుద్యోగులుగా, నిస్పృహతో తిరుగుతున్నారు. తప్పని పరిస్థితుల్లో కొందరు అతి చిన్న వుద్యోగాల్లో చేరి, తృప్తిపడుతున్నారు. అయినా సరే- భవిష్యత్తుని తీర్చి దిద్దడానికి, జీవితానికో బంగారు బాట యేర్పర్చుకోవడానికి, తగిన అవకాశాన్ని, యోగ్యతల్ని,



సంపాదించుకోడానికే, కాలేజీ చదువులు. నువ్విప్పుడు, అజంతా, ఎల్లోరా గుహలు చూడకపోతే, నీకు వుజ్వల భవిష్యత్తు వుండదనుకోకు. వాటికంటె, చదువుపట్ల దృష్టిని పెంపొందించుకోవడం, యెంతో అవసరం. ముఖ్యంగా, మనలాంటి మధ్యతరగతి జీవులకి..." అంటూ చిన్న వుపోద్ఘాతంలా చెప్పాడు, కనకరాజు.

కొడుకు కాస్తంతయినా, పరిస్థితుల్ని అర్థం చేసుకుంటాడన్న తాపత్రయంతో చెప్పాడుగాని, శ్రీనివాస్ ఆ ధ్యాసలోనే లేడు.

"అయితే, మన లేమి స్థితిని, వాళ్ళందరి ముందు, బైటపెట్టుకోమంటారన్నమాట?"

"తప్పేముంది? వాస్తవాన్ని వ్యక్తం చేసుకోవడానికి భయమెందుకురా? అబద్ధం చెప్పడానికి భయపడాలికాని. ఉదాహరణకి, నా విషయమే తీసుకుందాం. ఇప్పుడు నేను వెలిగిస్తోన్న యీ గుమాస్తాగిరీని చూసుకుని మురిసిపోయి, అర్హతలేని అంతస్తు కోసం, మాటువేసుకుని తిరిగితే, యెవరు హర్షిస్తారు చెప్పు. నా పరోక్షంలో,నలుగురూ నవ్వుతారు."

"హర్షించరని, చి[illegible] బట్టలో, లేక అతుకువేసినవి బట్టలో వేసుకుని తిరగడం బావుంటుందంటారా నాన్నా?" యెదురు ప్రశ్న వేశాడు, శ్రీనివాస్.

"అదీ మంచిది కాదనుకో! మనకి వున్నంతలో, మనం సాగదగినంతలో, అవసరమైన మేరకే మన ఖర్చులుండాలంటాను. మన తాహతుకి మించిన ఖర్చులకి పోతే, యెవ్వరికైనా విచారించాల్సింది మనమేనంటే, ఒప్పుకుంటావుకదా!" సౌమ్యంగా అన్నాడు.

శ్రీనివాస్‌కి, తండ్రి వుపన్యాసాలు విసుగు పుట్టించాయి. అతడి మనస్తత్వ రీత్యా, తండ్రి చెప్పినవి వుపన్యాసాలే అనిపించాయి తప్పించి, వాటి విలువను తెలుసుకో లేక పోయాడు.

"అనవసరంగా వాదోపవాదాలు యెందుకు లెండి నాన్నా. ఇంతకీ యేమంటారు? ఇవ్వాళ, ఆ డబ్బుయిస్తారా, లేక, నన్ను కాలేజీ మానేయమంటారా?" విసురుగా అన్నాడు.

కనకరాజు, స్తబ్ధుడయ్యాడు, అతని మొహంలో రంగు మారింది. ఆరోజు వరకూ, శ్రీనివాస్ అంత విసురుగా, ధైర్యంగా మాట్లాడిన సందర్భం, మరేదీ అతనికి గుర్తురాలేదు. వాడిలో, యిటువంటి పరిణామం యెందుకు, యెలా వస్తున్నదోనని, కలవరపడ్డాడు. వాడిలో యీ మార్పు వాడికేకాదు- కుటుంబానికే అనర్థం... అనుకున్నాడు. వాడికి యిప్పుడెలా నచ్చచెప్పాలో, అర్థంకాలేదు. ఏదో చెప్పాలి. వాడి ఆవేశాన్ని, అనాలోచితాన్ని,తగ్గించాలి.... అనుకున్నాడు, కనకరాజు.

"నీకు యెలా నచ్చచెప్పడమో, నాకు తోచడం లేదురా అబ్బాయ్. డబ్బు అడగ్గానే తెచ్చి పడేయడానికి, మనకేం డబ్బు బ్యాంకుల్లో మూలగడం లేదు. నీకు మాత్రం తెలిదా యేమిటి. మనం యెలా రోజులు నెట్టుకొస్తున్నామో?

సంపాదిస్తున్నవాణ్ణి, నేనొక్కణ్ణి. నా ఒక్కడి సంపాదన మీదే మన సంసారమంతా సాగాలి. దీనికి తోడు, ప్రతినెలా యేవో అదనపు ఖర్చులు వెన్ను తడుతూనే వున్నాయ్. ఏదీ తప్పించుకోలేం. పోనీ, కొందరిలా మనకి అదనపు ఆదాయం యేదన్నా వుందా అంటే, అదీ లేదు..'' అని చెప్పుకుపోతున్న కనకరాజు వాగ్ధోరణికి అసహనంగా అడ్డొచ్చాడు, శ్రీనివాస్.

"ఈ సోదంతా నాకు అనవసరం నాన్నా, కాలేజీ చదువు సాగించే ఆర్థికస్తోమత మనకి లేనపుడు, నేనింక ఆ చదువులు సాగించడం అర్థం లేదు. తోటి విద్యార్థుల సమక్షంలో న్యూనత పొందడం కంటె, యేకంగా చదువుకి స్వస్తి చెప్పడమే సమంజసంగా తోస్తోంది...'' అంటూ అక్కణ్ణించి తన గదిలోకి వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

కనకరాజు, అయోమయస్థితిలో పడ్డాడు. "ఒరేయ్ అబ్బాయ్.. యిటుగో మాట..'' అని పిలుస్తున్నా, వినిపించుకోలేదు, శ్రీనివాసు.

కనకరాజుకి, మరోషాక్ తగిలినట్టయ్యింది. బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు. అబ్బాయి అలా ప్రవర్తించాడన్న విషయం గూరించి బాధపడలేదతను. కాని, వాడలా యెందుకు మారిపోతున్నాడా, అన్న బాధే అతనిలో కలవరాన్ని సృష్టిస్తోంది. అతని హృదయంతరాళంలో, అవ్యక్తమైన అలజడి ప్రారంభమయ్యింది. ఇంక, ఆఫీసు పని మీద ధ్యాసపోలేదు. టేబిలు మీద వున్న ఆఫీసు కాగితాల్ని తీసి, ఫైల్లో కట్టేసి లేచాడు. తనిప్పుడు డబ్బుకోసం ప్రయత్నించాలి.. తప్పదు.. అనుకుంటూ బైలుదేరాడు.

వంటగదిలోంచి వస్తూ, లక్ష్మి యెదురయ్యింది.

"ఇప్పుడెక్కడికి బయల్దేరారు?'' అంది.

"అలా వెళ్ళొస్తాను లక్ష్మీ'' అన్నాడు.

"అదే – యిప్పుడెక్కడికి అని అడుగుతున్నాను. భోజనానికి వేళ కూడా అవుతోంది..'' అంది లక్ష్మి.

"అర్జంటు పని మీద వెళ్తున్నాను. మరేంప్రశ్నలు వెయ్యకు. ఇప్పుడే వచ్చేస్తాలే..'' అంటూ చకచకా ముందుకు సాగి పోయాడు, కనకరాజు.

లక్ష్మి, నిర్ఘాంత పోయింది. ఆమెకి యేవీ అర్థం కాలేదు. అంత అర్జంటుగా వెళ్ళాల్సిన పనేమిటి, ఆమె వూహకి అందలేదు. అలా ఆలోచిస్తూ, క్షణం వుండి పోయింది.

* * *

కనకరాజు, నేరుగా స్నేహితుడు గుర్నాథం యింటికి వెళ్ళాడు.

గుర్నాథం, అప్పుడే భోజనం ముగించినట్టున్నాడు, యీజీ ఛైర్‌లో చేరబడి, విలాసంగా సిగరెట్ కాల్చుకుంటున్నాడు.

కనకరాజుని చూడగానే లేచి ముందుకొచ్చి, ఆప్యాయంగా ఆహ్వానించాడు, గుర్నాథం.

"రావోయ్ రాజూ, ఏవిటిలా వచ్చావు? కూర్చో..'' అంటూ ఆసనం



చూపించి, తనూ కూచున్నాడు.

కనకరాజు, గుర్నాథంకి అభిముఖంగా కూచున్నాడు.

"చెప్పు రాజూ, యేవిటి సంగతి?'' అడిగాడు, గుర్నాథం.

"గుర్నాథం, చాలా అవసరంగా డబ్బు కావాలోయ్. ఈ తరుణంలో ఆదుకోగల స్తోమత వున్నవాడివి, నువ్వొక్కడివే. అందుకే యిలా వచ్చాను.'' అన్నాడు, కనకరాజు.

గుర్నాథం, స్వతహాగా మంచివాడే, డబ్బున్నవాడే, అప్పుడప్పుడూ స్నేహితుల్ని ఆదుకోవడంలో, అతనికతనే సాటి. అయితే, యిటీవల యిల్లు కట్టించడంలో, అనుకున్న దానికంటే అధిక మొత్తం వ్యయం చెయ్యడం వల్ల, అతనికి ఆర్థిక దిగ్బంధం యేర్పడింది. కాని, యీ నిజాన్ని చెప్పినా యెవరూ నమ్మరు.

"ఇంతకీ, యే మొత్తం కావాలేవిటి?'' చిన్న మొత్తమైతే, సర్దుబాటు చెయ్యాలన్న అభిప్రాయంతోనే అన్నాడు.

"ప్రస్తుతానికి, ఓ అయిదువందలుంటే, అవసరాలు తీరుతాయి. పూరికనే యివ్వమని అడగను. తక్కువ వడ్డీ యివ్వడానికి నేను సంసిద్ధమే.'' తన అభ్యర్థన కొద్ది అనేశాడు, కనకరాజు.

గుర్నాథంకి, కనకరాజుపై జాలేసింది. కనకరాజు, చాలా జాగ్రత్తగల వ్యక్తి. ఆడంబరాలకు పోయే వ్యక్తికాదు. వృధాగా ఖర్చు చెయ్యడు. అతనెప్పుడూ తన దగ్గర డబ్బు తీసుకెళ్ళలేదు. ఇన్నేళ్ళ పరిచయంలో, మొట్టమొదటి సారిగా యీరోజే అడుగుతున్నాడు అంటే, అతని అవసరం అటువంటిది అయ్యుంటుందనుకున్నాడు. కానీ.. కాని..తన దగ్గర అంత డబ్బు లేదే. ఆవిషయం చెబితే, రాజు నమ్మడేమో! ఏం చెయ్యాలో పాలుపోలేదు గుర్నాథంకి. మానసికంగా యెంతగానో బాధపడ్డాడు. కనకరాజులాంటి మంచి మనిషికి సహాయం చెయ్యలేక పోతున్నందుకు.

"సారీ కనకరాజూ! ఇంత డబ్బు ప్రస్తుతానికి నా వద్దలేదని చెప్పడానికి చింతిస్తున్నానోయ్. నువ్వు యెన్నడూ నన్నడగలేదు. ఈ రోజు అడిగిన నిన్ను, యీ విధంగా నిరుత్సాహపరుస్తున్నందుకు, నాకెంతో సిగ్గుగా వుంది. నా దగ్గర డబ్బు లేదంటే, యెవరికీ నమ్మకం కుదరదు. కాని, యిది అక్షరాలా నిజం. ప్రస్తుతానికి లేదు. గృహనిర్మాణం చేబట్టి, వూబిలోకి దిగిపోయాను. ఎవరితోనూ చెప్పుకోలేని పరిస్థితి. ఎస్టిమేట్ చేసిన దానికంటె రెండింతలు ఖర్చవుతోంది. ఇప్పుడనిపిస్తోంది రాజూ, నేరక యీ రొంపిలోకి దిగానని; ఇల్లు కట్టిస్తున్న వాణ్ణి చూసి, చాలా మంది అసూయపడతారు, అతని అదృష్టానికి. అతని తెలివితేటలకి, చాకచక్యానికి, అతణ్ణి యెంతగానో అభినందిస్తారు. కాని, ఆ వ్యక్తి, గృహనిర్మాణ కాలంలో, ఆ తర్వాత పడే అవస్థలు, అనుభవించే మనోవేదన, ఆరాటం, యితరులకి అర్థంకాదు. అతనొక్కడే అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. ఇప్పటి నా పరిస్థితి అదేరాజూ. నువ్వు మరేవీ అనుకోవద్దు. ఏదో, వందా, యాభై

కనకరాజు మొహం, నిరుత్సాహంతో నల్లబడిపోయింది. ఎంతో ఆశతో గుర్నాథం దగ్గరికొచ్చాడు. ఇంతవరకూ తన కొలీగ్స్‌ని యెవర్నీ అడగకపోయినా తప్పని సరి పరిస్థితుల్లో నోరువిడిచి, గుర్నాథంని అడిగాడు కాని, నిరాశే యెదురైనందుకు, మరింతగా బాధపడిపోయాడు. మనిషి జీవితంలో, డబ్బుకి యెంత ప్రాధాన్యత వుందో, ఆ క్షణంలో సూటిగా అవగాహనయ్యింది, కనకరాజుకి.

మనిషికి విజ్ఞాన సంపద వుండొచ్చు సంఘంలో యెనలేని పరపతి వుండొచ్చు, అధికారుల ఆదరణ వుండొచ్చు. కాని, ఆర్థిక సంపద లేకపోతే, పైవేవీ రాణించవేమోననిపించింది, కనకరాజుకి. స్వానుభవ పూర్వకంగా, అతను తెలుసుకున్న నిజమిది.

"ఎంతో ఆశతో వచ్చానోయ్ గుర్నాథం! కాని, యేం చేస్తాంలే. సమయానికి నీ దగ్గర డబ్బు లేకపోవడం. నా దురదృష్టానికి మరో తార్కాణం. మరి, వెళ్ళొస్తాను." అంటూ లేచాడు, కనకరాజు.

ఆ క్షణంలో కనకరాజు మొహం చూస్తుంటే, అంతులేని జాలి వేసింది, గుర్నాథంకి, జాలితో పాటు, బాధకూడా కలిగింది. ఎవర్నో ఒకర్ని, డబ్బు అప్పుగా అడిగి తీసుకోవడం, కొందరికి అలవాటు. అది, వారికి ఆషామాషీలాంటి వ్యవహారం. వాళ్ళ యిష్టమొచ్చినపుడు తిర్చి వచ్చునవే ధీమా! అది వారి నైజగుణం. అయితే, మరి కొందరికి, యితరుల్ని డబ్బు అప్పుగా అడగడమంటే, స్వాభిమానం కుంటుపడినట్లే వుంటుంది. అది, వారికి, ఆత్మహత్యా సదృశం. రెండోకోవకి చెందినవాడు కనకరాజని, గుర్నాథంకి బాగా తెలుసు. అందుకే, కనకరాజులో అంతర్లీనంగా వున్న బాధని గ్రహించగలిగాడు.

"కాస్త మజ్జిగ తీసుకుని వెళ్ళవోయ్.." అన్నాడు, గుర్నాథం.

"ఇప్పుడు మజ్జిగ తీసుకోవడం యేవిటోయ్! భోజనం వేళ కదా! ఇంటికి వెళ్ళి భోంచేస్తాను. మరోసారి వస్తాలే.." నిర్లిప్తంగా అన్నాడు, రాజు.

గుర్నాథం మనస్సు చివుక్కుమంది. అదీ నిజమే! భోజనాల వేళప్పుడొచ్చాడు, కనకరాజు. ఎంతో అవసరం లేకపోతే, ఆ సమయంలో రాడు కూడా.. అన్న ఆలోచన స్ఫురించింది, గుర్నాథంకి.

గుర్నాథం హృదయం, ద్రవించిపోయింది. అడిగినంత పైకం కాకపోయినాకొంతయినా సహాయం చేయ్యాలని పించిందతనికి. తన అవసరానికి, మరోచోట తెచ్చుకోవచ్చునని నిర్ణయించుకన్నాడు.

"కూర్చో కనకరాజూ! నిన్ను వట్టిచేతుల్తో పంపాలంటే, నాకే బాధగా వుంది, వస్తానుండు," అంటూ బలవంతంగా కనకరాజుని కూచోబెట్టి, లోపలికి వెళ్ళాడు, గుర్నాథం.

రెండునిమిషాల్లో తిరిగొచ్చాడు, గుర్నాథం అతని చేతిలో రెండు వందరూపాయలు నోట్లున్నాయి. "రాజూ, వున్నంతలో నీకు సహాయం చెయ్యాలనిపించిందోయ్. ఎప్పుడూ అడగని వాడివి అడిగావు గాబట్టి, వట్టిచేతుల్తో



నిన్ను పంపించడానికి మనస్కరించలేదు. నువ్వు కోరినంతా సహాయం చెయ్యలేకపోయినందుకు, మరేమీ అనుకోకు," అంటూ ఆ రెండు నోట్లూ కనకరాజు చేతిలో పెట్టాడు.

"థాంక్స్ గుర్నాథం! ప్రస్తుతానికి అవసరం తీరుతుందిలే మిగిలిన పైకం కోసం యేదో తంటాలు పడతాను. ఈ పైకం వీలున్నంత త్వరలో తిరిగి యిచ్చేస్తాను." అన్నాడు కనకరాజు. అతని మొహం కాస్తంత విప్పారిందిప్పుడు.

"అలాగేలే రాజూ! నీ దగ్గరున్నప్పుడే యివ్వు. వడ్డీకని యివ్వడం లేదు సుమా.. గుర్తుంచుకో!! నవ్వుతూ అన్నాడు, గుర్నాథం.

"అలాగే గుర్నాథం వస్తా మరి.." అంటూ ఆ డబ్బు జేబులో పెట్టుకుని, యింటి ముఖం పట్టాడు, కనకరాజు.

గుర్నాథం, తృప్తిగా నిట్టూర్పు విడిచాడు. ఒక మంచిపని చేశాననే 'తృప్తి' అతనిలో చోటు చేసుకుంది. కుర్చీలో చేరబడి, మరో సిగరెట్ వెలిగించాడు.

• • •

కనకరాజు యిల్లు చేరుకునే సరికి, అప్పుడే ముకుందం, శ్రీనివాస్, భోజనాలు ముగించుకుని చేతులు తుడుచుకుంటూ లేస్తున్నారు.

"శ్రీనూ.." మెల్లగా పిల్చాడు, కనకరాజు.

"ఏంటి నాన్నా?" అంటూ తండ్రి దగ్గరికి వచ్చాడు, శ్రీనివాస్.

"ఇదిగోరా, నువ్వడిగిన రెండొందలూ." అంటూ జేబులోంచి ఆ పైకం తీసి కొడుక్కి అందిస్తూ

"ఈ డబ్బు వాళ్ళకి యిచ్చేసి రారా! కేవలం యీ డబ్బు యివ్వలేదని, నువ్వుచదువు మానేయనక్కర్లేదు. ఒక్క విషయం గుర్తుంచుకో. ఆవేశం తగ్గించి, ఆలోచించి ప్రవర్తించడం నేర్చుకో." అన్నాడు.

శ్రీనివా[illegible] ...రేం మాట్లాడలేదు. డబ్బు జేబులో పెట్టుకుని, అక్కణ్ణించి తప్పుకున్నాడు. తండ్రి మాటలు, అతడి చెవుల్లో గింగురు పెడుతూనే వున్నాయి.

ముకుందం, ఆశగా చూశాడు కొడుక్కేసి. తన ప్రయాణానికి డబ్బు యిస్తాడేమోనని, అతని ఆసక్తి. అయితే, శ్రీనివాస్‌కిచ్చిన పైకం, కొడుకు యెలా తెచ్చాడో, అతనికి తెలీదు. కొందరికి వయస్సు మీదబడినా, వారి ఆలోచనలు పరిపక్వత చెందవు. అది, వారి నైజమే మరి. అటువంటి సూచనలేవీ లేకపోయేసరికి, అక్కణ్ణించి నిష్క్రమించాడు ముకుందం, బరువుగుండెతో.

లక్ష్మి మౌనంగా భర్తకేసి చూసింది. "ఎక్కణ్ణించి తీసుకొచ్చారండీ ఆడబ్బు?" అంది.

"గుర్నాథంని అడిగి తీసుకొచ్చాను లక్ష్మీ! లేకుంటే, మన సుపుత్రుడు చదువే మానేస్తానంటున్నాడు.." బాధగా నవ్వేడు, కనకరాజు.

"చిన్నవాడు లెద్దురూ, ఆనాలోచితంగా యేదో తొందరపడ్డాడు. ఆ మాటల్ని మీరు పట్టించుకోకండి..మీరుబట్టలు మార్చుకుని రండి, భోజనం చేద్దురుగాని.." అంది, లక్ష్మి.

సన్నగా ఓ నిట్టూర్పు విడిచి, బట్టలు మార్చుకుందుకు తన గదికేసి వెళ్ళిపోయాడు, కనకరాజు.

దుస్తులు మార్చుకున్నాక, కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చి, భోజనానికి కూచున్నాడు, కనకరాజు. లక్ష్మి వడ్డిస్తోంది.

"మన ప్రయాణం గురించి ఆలోచిస్తున్నారా?" అంది లక్ష్మి.

"ఒక్క మన ప్రయాణం గురించే కాదు లక్ష్మి! అటువంటి సమస్యలెన్నింటి గురించో ఆలోచిస్తున్నాను. ఇంటి యజమానిగా, బాధ్యతగల ఓ వ్యక్తిగా, సమస్యల్ని పరిష్కరించడం, నా కర్తవ్యంగా భావిస్తున్నాను. కృత్రిమమైన యీనాటి జీవనసరళిలో, మనిషి బాధ్యతలు అర్థరహితంగా పెరిగిపోతున్నాయి. వాటిని అరికట్టే ప్రయత్నం చెయ్యడం, ప్రవాహానికి యెదురీదినట్లే అవుతుంది. దానివల్ల, ప్రయోజనం యేమీ వుండదు. జీవితం, యిలా సాగాల్సిందే." నిస్తేజంగా అన్నాడు, కనకరాజు.

భర్త మాటల్లోని నిస్పృహని, అర్థం చేసుకో గలిగింది, లక్ష్మి. అందుకే, మళ్ళీ యేమీ ప్రశ్నించలేదు. అటువంటి యింగితం, యీ రోజుల్లో యెంత మంది గృహిణిలకు వుంటుంది?

"అన్నం వేసుకోండి.." అంది లక్ష్మి.

"వద్దు లక్ష్మి.." అంటూ చేయి కడుక్కుని లేచి పోయాడు, కనకరాజు.

కనకరాజు నేరుగా తన గదిలోకి వెళ్ళిపోయి, మంచంమీద చేరబడ్డాడు. పైన ఫేను తిరుగుతోంది. అతని మస్తిష్కంలోని ఆలోచనలు, అంతకంటె వేగంగా విహారం చేస్తున్నాయి.

* * *

సంసార రథాన్ని నడపడంలో, యింటి యజమానిగా భర్తకి యెంత బాధ్యత వుందో, గృహిణిగా, అతని సహధర్మచారిణిగా, భార్యకీ అంతే బాధ్యత వుంది.

ఈ సత్యాన్ని బాగా ఆకళింపు చేసుకున్న లక్ష్మి, భర్త అనుభవిస్తోన్న మానసికాందోళనని, అర్థం చేసుకుంది. కొడుకు అలా సమాధానం చెప్పి వుండక పోవల్సిందని, యిప్పుడనుకుంది. అనుకున్నదే తడవుగా, కొడుకు చదువుకొంటున్న గదిలోకి అడుగుపెట్టింది.

"శ్రీనూ.." మెల్లగా అంది.

"ఏవిటమ్మా?" తల్లికేసి తిరిగాడు, శ్రీనివాస్

"నువ్వు ఎక్స్‌కర్షన్‌కి యెప్పుడు వెళ్తున్నావురా?"

"మరో పదిరోజుల తర్వాత నమ్మా.."

"డబ్బు యిచ్చేశావా?"

"లేదమ్మా! రేపు యిస్తాను."

"మీ నాన్నగారు డబ్బు యేర్పాటు చెయ్యలేక పోయారనుకో.. అప్పుడు చదువు మానేస్తానన్నావట, నిజమేనా?"



"ఔనమ్మా.. అన్నాను. అందరూ వెళ్తుంటే, నేనొక్కణ్ణే వేల మొహం వేసి, వ్యవధి కోరడం, చిన్నతనం కాదా అమ్మా?"

లక్ష్మి భారంగా ఓ నిట్టూర్పు వదిలింది. "మీనాన్నగారు యెవర్నో అప్పు అడిగి తెచ్చారా పైకం. అప్పు అడగడం, ఆయనకి చిన్నతనం కాదా! ఇటువంటి భావాల్ని పెంచుకోకురా శ్రీనూ! మనకోసం మీనాన్నాగారు యెంత శ్రమపడుతున్నరో, ఓసారి ఆలోచించు. అలాగని, నిన్ను వెళ్ళొద్దని చెప్పడం లేదు. కాని, మాట్లాడే ముందు, కాస్త ఆలోచించి మాట్లాడు. నువ్వు చదువు మానేస్తే, నష్టం యెవరికనుకున్నావు? మాకు కాదు. నీకే!" అంటూ మెల్లగా మందలించింది.

శ్రీనివాస్, సమాధానం చెప్పకుండా, మొహం దించుకున్నాడు. తల్లి చెప్పినట్లు, తాను తొందర పడ్డాడేమో ననిపించింది.

శ్రీనివాస్ మౌనాన్ని గమనించి, మరేం అనకుండా వెళ్ళిపోయింది, లక్ష్మి.

* * *

ముకుందంకి, తన ప్రయాణం విషయంలో ఆతృత అధికమయ్యింది. తాను అడిగిన డబ్బు విషయంలో కొడుకు యింకా యేమీ చెప్పకపోవడం, అతనిలో అశాంతికి దారితీసింది. ఇంక మౌనంగా వుండలేకపోయాడు.

కొడుకు దగ్గరికి వెళ్ళి అడిగాడారోజు "ఒరేయ్ అబ్బాయ్, ఆ సీతారామయ్య, నా ప్రయాణం గురించి అడిగాడ్రా! రిజర్వేషన్లవీ చేయించుకోవాలికదా! నువ్వేమో, యింతవరకూ యేమీ తేల్చడం లేదు."

న్యూస్ పేపర్ చదువుతోన్న కనకరాజు, పేపరు మడత పెట్టి తలెత్తాడు.

"నేనూ ఆ ప్రయత్నంలోనే వున్నాను నాన్నా! ఎక్కడా అప్పు పుట్టడం లేదు. అబ్బాయి ఫీజ్‌ కట్టుకున్నాక, వాడికి రెండొందలు అప్పుగా తెచ్చి యివ్వడమే గగనమయ్యింది. మరో స్నేహితుణ్ణి అడిగాను.. ప్రయత్నిస్తానన్నాడు.. కాస్త ఓపిక పట్టాలి మరి.." అన్నాడు, కనకరాజు.

ముకుందం మొహం వాడిపోయింది. "నీ ప్రయత్నాలు ఫలించేసరికి, ఆ కాస్తా పుణ్యకాలం దాటిపోతుందిరా అబ్బాయ్. సీతారామయ్య వెళ్ళిపోతే, నాకు తోడెవరూ వుండరు. ఒంటరిగా వెళ్ళలేనాయె!" నిరుత్సాహంగా అన్నాడు, ముకుందం.

సరిగ్గా అదే సమయంలో, బైట్నుంచి ఈశ్వర్ వచ్చాడు. అతని చేతిలో చిన్న సూట్‌కేసుంది.

ఈశ్వర్ లక్ష్మి తమ్ముడు. పాతికేళ్ళకు దగ్గర్లో వుంటాడు. అప్పుడే రైలుదిగి వచ్చాడు. కనకరాజుని చూడగానే

"నమస్కారం బావగారూ! బైట, ఆ ముష్టి వెధవలు యెంత పొమ్మని చెప్పినా, పోకుండా వున్నారేవిటి? వీళ్ళతో గొప్ప చిక్కు. నిజం చెప్పాలంటే, యీ యాచకవృత్తి సుఖప్రదమైందనిగామోసు- వీళ్ళ జనాభా రోజు రోజుకి పెరిగిపోతోంది." అన్నాడు. అంటూనే అక్కడే వున్న ముకుందం వేపుచూసి "ఓ మావయ్యగారూ! ఇవే నా హృదయపూర్వక వందనాలు" నాటక ఫక్కీలోఅన్నాడు.

"ఊ.." తీక్షణంగా ఈశ్వర్ కేసి చూశారు, ముకుందం.

"అరె! అంత సీరియస్‌గా మొహం పెట్టారేమిటి? మీరంత దిగులుగా వుండటం, యింతవరకూ నేనెప్పుడూ చూళ్ళేదు మామయ్యగారూ.." ఆశ్చర్యంగా చూస్తూ, అన్నాడు ఈశ్వర్.

ఆ మాటలు, అగ్ని మీద ఆజ్యం పోసినట్టయ్యింది, ముకుందంకి.

"అది నా ఖర్మ నాయనా! ఎవర్నని యేం లాభం? ఎప్పుడు యేది అనుభవించాలో, యెవరు చెప్పగలరు?" దిగాలుగా అన్నారు, ముకుందం.

"ఇది మాత్రం అక్షరాలా నిజం మామయ్యగారూ! ఏనాడు యేమౌనో యెవరు చెప్పగలరు.." అని చివరి వాక్యం తత్వంలా పాడుతున్న ఈశ్వర్ నేపు యెర్రగా చూశారు, కనకరాజు. "స్టాపిట్ ఈశ్వర్... సమయం, సందర్భం లేకుండా యేమిటా జోకులు.." కోపంగా అన్నారు, కనకరాజు.

నిర్విణ్ణుడయ్యాడు, ఈశ్వర్. బావగారు కూడా ఆరోజు సీరియస్‌గా వుండటం, అతడ్ని మరింతగా ఆశ్చర్యపర్చింది.

"చచ్చాం! నువ్వూ సీరియస్‌గానే వున్నావా బావా? ఇవ్వాళ, యీ యింట్లో యేం జరిగింది? కిలకిల నవ్వుల్తో కళకళలాడుతూవుండే యీ యింట్లో, యీ రోజు నిశబ్దం, నిసుగులా కనిపిస్తున్నా యేమిటి?" నిస్తుపోతున్నట్లు, కళ్ళింతలు చేసుకుని మరీ అన్నాడు, ఈశ్వర్.

"ఆరాలు తియ్యడానికి ప్రయత్నించడం మానేసి, కాస్సేపు నోరుమూసుక్కూచోవోయ్" వారించాడు, కనకరాజు.

"ఆల్‌రైట్! నోరుమూసుకుంటాల్లే బావా" అంటూ సూట్‌కేసు క్రిందపెట్టి, దగ్గర్లోవున్న కుర్చీ లాక్కుని కూచున్నాడు, ఈశ్వర్.

"ఇదేనా రావడం?" మామూలు ధోరణిలో అడిగాడు, కనకరాజు.

"ఇది మరీ బావుంది బావా లేకపోతే...? ఎప్పుడోవచ్చి యెక్కడో వుండి, యిప్పుడే యిక్కడికి వచ్చాననుకుంటున్నావా? ఎంత చదువుకున్నా యీ పాత చింతకాయ ప్రశ్నలు మాత్రం వదిలారు కాదు మనవాళ్ళు." ముసిముసి నవ్వుతూ అన్నాడు, ఈశ్వర్.

ముకుందంకి, విసుగు, కోపం, యినుమడించినయ్. ఈశ్వర్ కేసి తీక్షణంగా చూస్తూ "అబ్బబ్బ! ఇదో తలనొప్పి." అన్నారు.

"ఏమిటి మామయ్యగారూ, తలనొప్పా! అనాసిన్ టాబ్లెట్‌యిస్తానుండండి." అంటూ తియ్యబోయాడు, ఈశ్వర్.

ముకుందం మొహం, కోపంతో ఎర్రబారింది.

"నువ్వే వేసుకో.." కోపంగా అనేసి, విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయారు, ముకుందం.

కనకరాజు మొహం, కందగడ్డలా మారింది. తన తండ్రిని, ఈశ్వర్ అలా అవమానించడం, సహించలేకపోయాడు.



"ఈశ్వర్, పెద్దవాళ్ళ పట్ల గౌరవం లేకుండా నువ్విలా ప్రవర్తించడం, యేం బావుండలేదు. ఓ సమయం, సందర్భం వుంటుంది. అవేవి నువ్వు పాటించడం లేదు. నీ అతివాగుడుని తగ్గించుకో.. అది నీకే శ్రేయస్కరం." గంభీరంగా అన్నాడు, కనకరాజు.

ఈశ్వర్, ఆ గంభీరతని అర్థం చేసుకున్నాడు.

"సారీ బావా! ఏదో సరదాగా వాగేశాను. నన్నుక్షమించు". మెల్లగా అన్నాడు, ఈశ్వర్.

కనకరాజు, భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఈశ్వర్, నీకు సరదాగా వుండొచ్చు. కాని, సమస్యలతో నేను సతమతమవ్వాలి, తెలుసా?"

ఈశ్వర్, కాస్తంత నిస్తు పోయాడు. "ఏమిటి బావా నువ్వంటున్నది? నీకు సమస్యలా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు, కనకరాజుని.

"ఏం నేను అందరిలాంటి మనిషిని కానా? నాకు సమస్యలుండవా? లేకపోతే, నేనేం ఆకాశం నించి వూడిపడి వచ్చాననుకుంటున్నావా?"

"అదికాదు బావా నిత్యం నవ్వుతూ, నవ్విస్తూ, నిశ్చింతగా బ్రతుకునీడుస్తోన్న మా బావగారికి సమస్యలుంటాయంటే, యెలా నమ్మడం?"

కనకరాజు, భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"అదేనోయ్ విశేషం, మనలాంటి మధ్యతరగతి కుటుంబాల్లో యిదో ప్రత్యేకత. తమలో నిబిడీకృతమై వున్న ఆవేదనని, బాధని, బాధ్యతల్ని ఒకరితో చెప్పుకోలేం. మనం, సంతోషంగా, సుఖంగా, యేచీకూ చింతా లేకుండా వున్నామని నలుగురూ అనుకునేలా, నవ్వుతూ బ్రతకడం, మనకి దేవుడిచ్చిన వరం." అన్నాడు.

"అందూ అంతేనంటావా బావా!"

"అందరి విషయం, నేను జనరలైజ్ చేసి చెప్పలేనుగాని, చాలామంది విషయంలో, నా అంచనా తప్పుకాదు. కొన్ని యెక్సెప్షన్స్ వుంటాయనుకో, అయితే, అందరూ నాలా బాహ్యంగా చెప్పుకోరు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల్లో యిదో గొప్ప బలహీనత అంటాన్నేను."

"ఏమిటో బావా, నీ థియరీ నాకు అర్థం కావడం లేదు." నిరుత్సాహంగా అన్నాడు, ఈశ్వర్.

"థియరీ కాదు ఈశ్వర్. ఇది స్వానుభవం. నేను స్వయంగా అనుభూతిని పొందుతున్నాను గాబట్టే చెప్పగలుగుతున్నాను. నేనేం చెప్పినా, వూహించి చెప్పను."

సూక్తులు, సుద్దులూ, బావ చెప్పడం మొదలు పెట్టాడంటే, యింక ఆ వాగ్ధాటికి అవరోధం వుండదని, ఈశ్వర్‌కి తెలుసు. అందుకే, ఆ ప్రస్తావనకి

ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్నాడు, ఈశ్వర్.

"సరేగాని బావా, నేనిప్పుడు రావడానికి కారణం యేవిటో వూహించావా?" టాపిక్ మార్చేస్తూ అన్నాడు, ఈశ్వర్.

"ఇంకేముంటుంది? మీ చెల్లెలి వివాహమే అయ్యుంటురంది?" చప్పున చెప్పాడు, కనకరాజు.

"కరెక్ట్! బాగా పసిగట్టావు.."

"ఇందులో గొప్పదనం యేముందని? మీ అక్కయ్య చెప్పగా ముందే తెలిసిందనుకో?"

"మీకు చెప్పడానికి, మిమ్మల్ని వివాహానికి ఆహ్వానించడానికి, నాన్నగారు స్వయంగా రావాలనే అనుకున్నారు బావా, కాని పెళ్ళి పనుల ఒత్తిడి వల్ల, రాలేకపోయారు. అందుకని, నన్ను పంపించారు మిమ్మల్ని ఆహ్వానించడానికి. మిమ్మల్నందర్నీ, కాస్త ముందుగానే రమ్మని కోరారు. ఇదిగో, ఆహ్వాన పత్రిక.." అంటూ సూట్‌కేస్ తెరిచి అందులోంచి శుభలేఖ తీసి బావకి అందించాడు, ఈశ్వర్.

కనకరాజు శుభలేక తీసి చదువుకున్నాడు. "శుభలేఖ అందంగా కొట్టించారోయ్. చాలా బావుంది. ఔనూ, దీనికోసం నువ్వు స్వయంగా రావాలంటోయ్? పోస్టులో పంపించేస్తే సరిపోయేదిగా;" అన్నాడు.

ఈశ్వర్ గతుక్కుమని, బావకేసి అదోలా చూశాడు.

"ఏం, నేను రావటం నీకు యిష్టం లేదా బావా?" సూటిగా ప్రశ్నించాడు.

కనకరాజు, షాక్ తిన్నాడు. తాను అలా అనకుండా వుండాల్సింది. అనుకుని, చప్పున తమాయించుకుని, మందహాసం చేశాడు.

"నీ ఆకతాయితనం పోయింది కాదోయ్ ఈశ్వర్. నా వుద్దేశం యేవిటో నువ్వు గ్రహించలేకపోయావు. మీ అక్కయ్య, మొన్ననేగా అక్కణ్ణించి వచ్చింది. ఆమెద్వారా యెలాగు కబురు పంపారు. అనవసరంగా నీకీ శ్రమ యెందుకు చెప్పు? మీనాన్నగారు, అక్కడ ఒక్కరై పోతారు. పెళ్ళిపనులన్నీ ఒక్కరూ చూసుకోవడం యెంతకష్టమని? అందుకే అన్నాను. గాని, నువ్వు మరోలా అర్థం చేసుకున్నావు." అన్నాడు, కనకరాజు, మెల్లగా మందహాసం చేస్తూ.

ఈశ్వర్, సీరియస్ మూడ్ నుంచి బైట పడ్డాడు.

"ఆ విషయంలో చింత లేదు బావా! నాన్నగారి ఆఫీసు బలగం వుందిలే, వాళ్ళే యేర్పాట్లన్నీ చూసుకుంటారు. అయినా, మేం యెవరమైనా స్వయంగా వచ్చి ఆహ్వానించకపోతే, నువ్వు బాధపడతావని, నాన్నగారి అభిప్రాయం, ఇంటి అల్లుడివి కదా?" ముసిముసి నవ్వుతూ అన్నాడు, ఈశ్వర్.

"ఏవిటో, అన్నీ ఛాందసాలే మీనాన్నవి.. లక్ష్మి.. లక్ష్మి.." అంటూ కేక వేశాడు, కనకరాజు.

"పిలవడ మెందుకులే బావా! నేనే లోపలికి వెళ్తాను" అంటూ సూట్‌కేసు పట్టుకుని, లోపలికి నడిచాడు, ఈశ్వర్.

కనకరాజు, బరువుగా ఓ నిశ్వాసం వదుల్తూ కుర్చీలో వెనక్కి



జేరబడిపోయారు.

* *

కనకరాజు, అదనంగా యెలా ధనార్జన చెయ్యడమా, అన్న ఆలోచనలో పడ్డాడు. అలాగని, అన్యాయార్జితం, అతనికి యిష్టం లేదు.

అతనికి అందుబాటులో వున్న అవకాశం ఒక్కటే దృష్టిలో మెదిలింది. ఎక్కడయినా, పార్ట్‌టైమ్ జాబ్ చెయ్యడం.

కనకరాజుకి, యినేకంటాక్స్, సేల్సుటాక్స్ లెక్కలు రాయడంలో ప్రత్యేకనిపుణత వుంది. చాలా రోజులక్రితం వీటికి సంబంధించిన ఓ లాయరు దగ్గర పార్ట్‌టైమ్ జాబ్ చేసి, వాటిలో గల మెళకువలు క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. కొంత కాలం తర్వాత, ఆ లాయర్‌కీ, అతనికీ భేదాభిప్రాయాలొచ్చి, మానేశాడు. నిజానికి ఆ లెక్కలు రాయడం, అందరికీ చేతనవదు. దానికెంతో నేర్పు వుండాలి. ఎంతో అనుభవం కావాలి. ఆ నేర్పూ, అనుభవం, రెండూ కనకరాజుకి వున్నయ్.

ఆర్నెళ్ళ క్రితం, భీమరాజు అనే ఓ పారిశ్రామిక వేత్తని కలియడం జరిగింది, కనకరాజు. ఇన్‌కమ్‌టాక్స్, సేల్సుటాక్స్ కన్సల్టెంటు లాయరు దగ్గర పార్టుటైము జాబ్ చేస్తున్న రోజుల్లో భీమరాజు యిన్‌కమ్‌టాక్స్ అండ్ సేల్సుటాక్స్ లెఖ్ఖలే రాసేవాడు, కనకరాజు. అప్పట్లో మానేశాడు.

"కనకరాజుగారూ, మా లెఖ్ఖలు మళ్ళీ మీరే చేపట్టకూడదటండీ, ఇప్పుడు రాస్తున్న వ్యక్తితో మేం కొన్ని సమస్యల్ని యెదుర్కోవాల్సి వస్తో..." అని భీమరాజే అడిగాడు.

అయితే, యెప్పుడో రాయడం మానేసిన ఆ లెఖ్ఖల్ని, మళ్ళీ ప్రారంభించడం, బుర్ర పాడు చేసుకోవడం, యిష్టం లేకపోయింది, కనకరాజుకి. అప్పట్లో, అతనికి జీవితం యే ఒడుదుడుకుల్లేకుండా సాఫీగానే సాగిపోతోంది. ధనార్జన ఆవశ్యకత లేకపోయిందప్పట్లో. అదీగాక, అటువంటి దొంగ లెఖ్ఖల్ని రాయడం, ధనవంతుల్ని మరింత పెంచడమేనని, ప్రభుత్వం కళ్ళు గప్పడమేననిపించిదప్పట్లో.

"క్షమించండి భీమరాజుగారూ" నాకిప్పుడు బొత్తిగా తీరిక లేకుండా వుందండీ ఆఫీసుపనితో." అన్జెప్పి తప్పించుకున్నాడప్పట్లో.

భీమరాజు, సన్నగా నవ్వేశాడు. అతను తల్చుకుంటే, కొండమీద కోతి కూడా దిగొస్తుంది. కనకరాజుని బలవంతం చెయ్యలేదు.

"సరే! మీయిష్టం.." అనేసి వెళ్ళిపోయాడాయన.

కనకరాజుకి, యిప్పుడా సంఘటన గుర్తుకొచ్చింది. మనసులో యెంతో బాధపడ్డాడు. కాళ్ళదగ్గరికొచ్చిన అవకాశాన్ని, చేజేతులా జారవిడుచుకున్నందుకు పశ్చాత్తాప పడ్డాడు. అయితే, అవసరాలు ముందుగా అల్టిమేటమ్ యివ్వవు కదా?. . . అనుకున్నాడు.

ఇప్పుడు స్వయంగా వెళ్ళి, భీమరాజుని అడిగితే, ప్రయోజనం వుండొచ్చునేమోనన్న ఆశ, అతని మస్తిష్కంలో మెదిలింది. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా భీమరాజు దగ్గరికి ప్రయాణమయ్యారు, కనకరాజు.

కనకరాజుని చూడగానే, ఆప్యాయంగా ఆహ్వానించారు, భీమరాజు. ఎందుకోమరి, అతనికి కనకరాజు పట్ల ప్రత్యేకమైన అభిమానముంది.

"రండి.. రండి, కనకరాజుగారూ! మీరిలా దయచేయడం, మా అదృష్టమే కూచోండి." అన్నారు, భీమరాజు.

కనకరాజు కుర్చీలో ఆసీనులయ్యారు. "మీ అభిమానానికి థాంక్స్ భీమరాజుగారూ" వినమ్రతగా అన్నారు.

"మనం మొహాలు చూసుకున్న వేళావిశేషం యేమిటోగాని, మీరంటే, నాకు ప్రత్యేకాభిమానం వుంది కనకరాజుగారూ. ఎందరో విద్యార్థులు, వుద్యోగులు, అదనంగా సంపాదించాలని, యేదో పార్ట్‌టైమ్ జాబ్‌కోసం నా దగ్గరికి వచ్చిన వాళ్ళున్నారు. అయినా, నేను వాళ్ళని పెట్టుకోడానికి అంగీకరించలేదు. మీరు నాదగ్గరుంటే, నాకెందుకో కొండంత బలం వుంటుందని, అప్పట్లో మిమ్మల్ని కోరాను. కాని, మీరు అంగీకరించారు కారు. అందుకు కారణం యేదయినా అప్పుడే నేననుకున్నాను, ధనార్జన పట్ల మీకు తాపత్రయం లేదని! అన్నారు భీమరాజు సన్నని మందహాసంతో.

భీమరాజు మందహాసం మరుగున యెంతో దర్పం వుంది. ఆ దర్పంలో 'అహం' వుందో, లేదో గ్రహించుకోలేక పోయారు, కనకరాజు. ఏమైతేనేం– తనంటే అతనికి అభిమానమున్న మాట వాస్తవమనుకున్నారు. అది, ఒకందుకు మంచిదేననుకున్నారు.

"మీకు నాపట్లగల సదభిప్రాయానికి, మరోసారి ధన్యవాదాలు చెప్పుకుంటున్నానండి" అన్నారు, కనకరాజు.

"దానికేం లెండి.. చెప్పండి, యేమిటిలా దయచేశారు?" అడిగారు, భీమరాజు.

"భీమరాజుగారూ, మేం అతి సామాన్యులం. మేం అనుకున్నది ఒకటయితే, జరిగేది వేరుగా వుంటుంది. అటువంటి జాతకాలు మావి. ఆరోజు, మీ అంతట మీరే కోరినా మీ లెక్కలు రాయడానికి, నేను నిరాకరించాను. కాని యిప్పుడు నా అంతటనేనే మిమ్మల్ని అర్థించడానికి వచ్చాను.." అన్నారు కనకరాజు.

భీమరాజు, ఆశ్చర్యంగా కనకరాజుకేసి చూశారు. వున్నది వున్నట్టు చెప్పిన కనకరాజు నిజాయితీని మనసులో హర్షించారు.

"అంటే?" పూర్తిగా అర్థంగానట్టే అడిగారు.

"మీరుకోరినట్టే, మీ కాలుకు యివేకంటాక్సు, సేల్సుటాక్సు లెక్కలు రాస్తాను. అయితే, నాకో సహాయం చేసి పెట్టాలి."

"హఠాత్తుగా మీలో మార్పు వచ్చేసిందన్న మాట? మంచిదే నేను



చేయవల్సిన సహాయం యేమిటో చెప్పండి.

"నాకు ఓ వెయ్యిరూపాయలు కావాలండీ! అది కేవలం అడ్వాన్సు రూపంలోనే నెలకి మీరు నాకు యెంత యివ్వదల్చుకుంటే, ఆ మొత్తం అందులో కోట్టేసుకోండి. ఇది నా అభ్యర్థన."

భీమరాజు, సన్నగా మందహాసం చేశారు.

"మీ మనస్తత్వాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నానండీ కనకరాజుగారూ. నేను మిమ్మల్ని కోరి అడిగినపుడు, కాదన్నారు. ఇప్పుడు మీ అంతట మీరే వచ్చి అర్థిస్తున్నారు.."

"ముందుగానే చెప్పాను కదండీ భీమరాజుగారూ! మాలాంటి జాతకులకు, ఆలోచించిన దానికి భిన్నంగానే యెప్పుడూ జరుగుతూ వుంటుంది. అనుకోని కొన్ని ఖర్చులు అర్థంతరంగా వచ్చి పడినియ్యండీ! పైకం సంపాదించాలని నేను చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయండీ. అప్పుడు మీరు గుర్తుకొచ్చారు. వెంటనే వచ్చేశానండీ" వున్నది వున్నట్టు చెప్పేశారు, కనకరాజు.

భీమరాజు, అతని అవసరాన్ని అవగతం చేసుకున్నారు.

"అర్థం చేసుకున్నాలెండి, రాజుగారూ, నాపై యి... ... పెంచుకుని వచ్చినపుడు, మిమ్మల్ని నిరాశకు గురిచెయ్యనండీ మీరు కోరినట్టే వెయ్యి రూపాయలు తీసుకెళ్ళండి. రోజూ సాయంత్రం ఓ గంట మీరొచ్చి యిక్కడి పనులు చూసుకుంటే చాలు. నెలకి రెండొందల యాభై యిస్తాను సమ్మతమేనా!" అన్నారు, భీమరాజు.

కనకరాజు మొహం విప్పారింది. అతనికి అంతకంటె కావాల్సిందేముంది.

"నాకేం అభ్యంతరం లేదు భీమరాజుగారూ! నిజంగా మీరు యెంతో మంచివాళ్ళండీ!" వుత్సాహంగా చెప్పారు, కనకరాజు.

భీమరాజు మెల్లగా నవ్వేరు. "నన్ను మరీ పొగడకండీ కనకరాజుగారూ, ఇదిగోండి మీరు కోరిన వెయ్యిరూపాయలు" అంటూ కేష్‌బాక్స్ నుండి వెయ్యిరూపాయలు కట్ట తీసి అందించారు.

కనకరాజు కళ్ళు, మెరిసినయ్ డబ్బు చూసికాదు. తన సమస్యలు పరిష్కారమౌతున్నాయన్న సంతోషంతో. ఆ పైకాన్ని జేబులో పెట్టుకున్నారు.

"థాంక్సండీ భీమరాజుగారూ! సమయానికి మీరందించిన యీ సహాయాన్ని మర్చిపోలేను. రేపట్నుంచి సాయంత్రం పూట వస్తుంటానండీ! మరి సెలవు తీసుకుంటాను." అంటూ లేచారు కనకరాజు.

"అప్పుడే వెళ్ళిపోతే యెలా? కాఫీ తీసుకుని మరీ వెళ్ళండి." అంటూ కనకరాజుని కూచోబెట్టి నౌకరుచేత కాఫీ తెప్పించి, యిచ్చారు.

కాఫీ తీసుకున్నాక, తృప్తిగా ఓ చిర్నవ్వు నవ్వుతూ వెళ్ళి పోయారు, కనకరాజు.

భీమరాజు, సన్నగా నవ్వుకున్నారు. ఆ నవ్వులో గర్వం లేశమాత్రమైనా

లేదు. కనకరాజులాంటి వ్యక్తికి, అవసర సమయంలో సహాయం చేశాననే తృప్తి మాత్రమే వుంది. డబ్బున్న వాళ్ళందరూ ఒకేలా వుండరు మరి.

* * *

కనకరాజు, ఆఫీసుకి బయల్దేరే ప్రయత్నంలో వుండి, బట్టలు మార్చుకుంటున్నాడు.

"మన ప్రయాణం గురించి యేమాలోచించారండీ!" అంటూ లక్ష్మి అక్కడికి వచ్చింది.

"మీ చెల్లాయి పెళ్ళికి మనం వెళ్తున్నట్టే లక్ష్మీ! రాత్రి చెప్పాను కదా, కొంతపైకం యేర్పాటయ్యింది. అందులో కొంత నాన్నగారికివ్వాలి. మిగిలింది మన ప్రయాణానికి . . . మనం వెళ్ళేవరికి, నా జీతం కూడా దొరుకుతుంది కదా! ఎలాగో అడ్జస్ట్ అయిపోతాం.

లక్ష్మి, క్షణం తటపటాయించింది. "మీనాన్నగారు యిప్పుడు తీర్థయాత్రలకు వెళ్ళక పోతే, వచ్చిన నష్టమేమిటండీ?" అంది, సాలోచనగా.

"మన దృష్టిలో నష్టం యేమీ లేదు లక్ష్మి పుణ్యం ,పురుషార్థం వస్తుందని ఆయన తాపత్రయం. ఆ వయసులో అందరికీ వుండే తాపత్రయమే అది. అందుకే, మన పరిస్థితులేవీ ఆలోచించకుండా, ఆయన ప్రయాణానికి సిద్ధపడుతున్నారు."

"నేనోసారి చెప్పి చూస్తానుండండి"

"వద్దు లక్ష్మి నువ్వు చెప్పినా, నేనే నిన్ను పురమాయించానని, ఆయన అపోహపడొచ్చు, వున్నంతలో, మనమే సర్దుబాటు చేసుకుందాం. ఖర్చులన్నీ ఒకేసారి వచ్చి పడ్డాయనిగాని, లేకపోతే యేదో విధంగా అడ్జస్టు అయ్యేవాళ్లం." అన్నాడు, కనకరాజు

లక్ష్మి, మౌనంగా ఓ నిట్టూర్పు విడిచింది. భర్త మానసిక పరిస్థితిని అర్థం చేసుకుంది. ఆయనపట్ల జాలికలిగింది. ఇంటి యాజమానిగాఆయనకి, యింట్లోని సభ్యులందరి అవసరాలూ తీర్చే బాధ్యత వుంది. కాని, ఆస్తోమత వున్నదీ, లేనిదీ, యెవరు అవగాహన చేసుకుంటున్నారు?.... అనుకుంది లోలోన.

"సరే మీయిష్టం, మా చెల్లెలి కోసం వాచీ తీసుకోవడం మాత్రం మర్చిపోకండి. అది, నోరు విడిచి అడిగిందని చెబుతున్నానుగాని, లేకపోతే ప్రస్తుత పరిస్థితుల్లో, మనకి ఆ తాహతు లేదని తెలుసు. పోతే, హెచ్చెమ్టీ వాచీయే తీసుకోవాలనేం లేదు. కాస్త తక్కువలో వచ్చేదేదయినా తీసుకోండి" అంది లక్ష్మి.

అర్ధాంగి అపాటి అర్థం చేస్కుకున్నందుకు సంతోషించాడు, కనకరాజు. అతనికి తెలుసు, లక్ష్మి మనస్తత్వం. అపాటి యింగితం, అవగాహన గల గృహిణి వుంది గాబట్టే, తాను సంసార సాగరంలో యీదుకొస్తున్నాడు.. అనుకున్నాడు





మనసులో.

"నువ్వయినా అపాటి అర్థం చేసుకున్నావు లక్ష్మి చాలా సంతోషం ఏదో చేద్దాంలే. మరి, నేను వెళ్ళొస్తాను." అంటూ, టేబిలు మీదున్న ఫైలు తీసుకుని నిష్క్రమించాడు.

లక్ష్మి, ద్వారం దగ్గర నించి వెనక్కి తిరిగి లోపలికి వచ్చేసింది.

"అమ్మా, నాన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోయారా?" అడిగింది, వసంత.

"ఔనమ్మా! ఏం?"

"పిన్ని పెళ్ళి దగ్గర బడుతోంది. మరి, నాకు చీర యెప్పుడు కొంటారమ్మా?" అడిగింది, వసంత.

కూతురుకి యేం సమాధానం చెప్పాలో, బోధపడలేదు లక్ష్మికి. ఒక్కగానొక్క అమ్మాయి అమె ముద్దు ముచ్చట తీర్చాల్సిన బాధ్యత కూడా వుంది తండ్రికి. కాని, యిప్పటికే, ఆయన ఆర్థిక పరమైన యిబ్బందులతో సతమతమైపోతున్నారు. పరిస్థితి తెలిసికూడా, తానేమీ చెయ్యలేని అయోమయ స్థితిలో వుంది. అటువంటప్పుడు, కూతురికి యేం జవాబు చెబుతుందని? అయితే కూతుర్ని నిరుత్సాహపర్చడమూ ఆమెకి మనస్కరించడం లేదు.

"కొంటార్లే అమ్మా. ఇంకా వ్యవధి వుంది కదా?" అంది.

"పెళ్ళికి అందరూ మంచి మంచి చీరలు కట్టుకొస్తారు. నాకూ కొత్తరకం చీర యేదయినా కొనమ్మా" అంది వసంత.

" అలాగేలే అమ్మా." ఓ నిట్టూర్పు విడుస్తూ అంది, లక్ష్మి.

తల్లి సమాధానం, వసంతకి యెంతో సంతృప్తిని కలిగించింది. చిన్న కూనిరాగం తీసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

లక్ష్మి దిగులుగా వంట గదికేసి నడిచింది. గోధుమపిండి గిన్నెలో రాత్రి రొట్టెల కోసం తడుపుతోందేగాని, అమె మెదడులో యెన్నో ఆలోచనలు గింగురు పెడుతున్నాయి. ఏవిటో తమ జీవితాలు ఎదుగూ, బొదుగూలేని సామాన్య బ్రతుకులు? పిల్లల అచ్చట, ముచ్చటలు తీర్చే అవకాశాలు కూడాలేని అర్థరహిత జీవితాలు?... వ్యర్థ జీవితాలు. . . యిలా అనుకుంటూ వుంటే . అమె కళ్ళు, అప్రయత్నంగా చెమ్మగిల్లినయ్. "అమ్మాయ్ లక్ష్మి.." అన్న మావగారి పిలుపు వినేసరికి, ఆలోచనల నుండి తేరుకుని, వాస్తవలోకంలో పడింది, లక్ష్మి.

"వస్తున్నాను మావగారూ" అంటూ కేకవేసి, ముందుగదిలోకి వెళ్ళింది చరచరా.

"భోజనం వడ్డించేయ మంటారా మావగారూ?" అంది.

"కాస్సేపు ఆగమ్మా, ఇప్పుడేకదా వచ్చాడు యెండలోంచి కొంచెం రెస్టు తీసుకోని." అలసిపోయి వున్నట్టుగా అన్నాడు, ముకుందం.

"అయినా, మీరిలా యెండలో యెందుకు తిరుగుతారు మావగారు, బైట యెండ యెంత తీవ్రంగా వుందో చూడండి?"

"అవసరమైతే, వెళ్ళక తప్పుతుందా అమ్మా? అలా సీతారామయ్య

దగ్గరికి వెళ్ళొచ్చాను. ముందుగానే రైళ్ళల్లో రిజర్వేషన్లు చేసుకోకపోతే ప్రయాణాలు దుర్భరంగా వుంటాయంటున్నాడు, సీతారామయ్య. ఉత్తర భారతంలో మరీ యెండలాయె. అబ్బాయి, యిదిగో, అదిగో అంటాడేగాని, ఆ పైకం విషయం యేమీ తేల్చడు. నీతో యేమన్నా చెప్పాడా అమ్మా?" ఆసక్తిగా అడిగాడు, ముకుందం.

మామగారితో, తమ యింటి పరిస్థితులు చెప్పుకోడానికి మంచి అదను దొరికిందనిపించింది, లక్ష్మికి. అయితే, భర్త ముందుగానే, హెచ్చరికగా చెప్పిన మాటలు, ఆమె చెవుల్లో గింగురు పెట్టాయి. అందుకే, తన ఆలోచనల్ని ఆచరణలో పెట్టలేకపోయింది. "పైకం యేర్పాటు చేసినట్టే చెప్పారు మామగారూ సాయంత్రం వచ్చి, మీకిస్తారేమో? అంది.

ముకుందం మొహం విప్పారింది. అతని కళ్ళల్లో ఆనందానుభూతితో కూడిన వెలుగు తళుక్కుమంది. చిరకాల వాంఛ తీరబోతున్నందుకు, యెంతగానో సంబరపడిపోయాడు.

"నాకు తెలుసునమ్మా, వాడు తప్పకుండా యేర్పాటు చేస్తాడని. నేనంటే, వాడికి యెంతో గౌరవం. . . భక్తిను?" ఉత్సాహంగా అన్నాడు, ముకుందం.

మనిషి యే పరిస్థితుల్లో సంతోషిస్తాడో, యెందుకు సంతోషిస్తాడో, అప్పుడు తెలుసుకుంది, లక్ష్మి. ఎంత విచిత్రమైన మనస్తత్వం మనిషిది! అనుకుని, మరేం మాట్లాడకుండా వెనక్కి తిరిగి వెళ్ళి పోబోతుంటే, ముకుందమే అన్నాడు.

"వడ్డించేయమ్మా, వస్తున్నాను." అంటూ వుత్తరీయాన్ని భుజమ్మీది వేసుకుని, పెరట్లోకి దారితీశాడు, ముకుందం .

లక్ష్మి, వంటగది కేసి నడిచింది

* * *

ఆ రోజు సాయంత్రం, ముకుందం పార్కుకి బయల్దేరాడు.

ప్రతిరోజూ, సీతారామయ్య, ముకుందం, సాయంత్రం పూట అదే పార్కులో కలుసుకుంటారు. అది వాళ్ళకి దినచర్య.

ముకుందం వెళ్ళేసరికి, సీతారామయ్య ఒక్కడే కూచున్నాడు బెంచీమీద.

తానూ, తన ప్రయాణానికి డబ్బు యేర్పాటు చేసుకున్నానన్న ఆనందాన్ని వ్యక్తం చేసుకోవాలన్న తాపత్రయం మెండుగా వుంది, ముకుందంకి. అందుకే, వెళ్తూనే

"సీతారామయ్య, నా ప్రయాణం కూడా నిశ్చయమైనట్టే. మా అబ్బాయి పైకాన్ని యేర్పాటు చేశాడు. రేపు వుదయమే తెచ్చి యిచ్చేస్తాను." వుత్సాహంగా చెబుతూ, సీతారామయ్య పక్కనే ఆశీనుడయ్యాడు, ముకుందం.

సీతారామయ్య, చప్పున జవాబు చెప్పలేదు. అతని మొహంలోకి చూశాడు, ముకుందం. అతని మొహంలో, యేదో మార్పు వచ్చినట్టు పసిగట్టి, విస్తుపోయాడు. ఇంతలోనే మార్పా?. . . అనుకుని



"ఏవిటీ సీతారామయ్య, ఒక్కసారి అలా అయిపోయావు? ఏం జరిగింది?" ఆరాటంగా అన్నాడు, ముకుందం.

సీతారామయ్య, భారంగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"నా ప్రయాణాన్ని విరమించుకుంటున్నాను ముకుందం" అన్నాడు, నిర్లిప్తంగా.

షాక్ తగిలినట్టయ్యింది, ముకుందంకి. ఈ హఠాత్పరిణామానికి కారణం యేవిటో, అతనూహించలేక పోయాడు.

"ఆశ్చర్యంగా వుంది సీతారామయ్యా! నిజానికి నా ప్రయాణం అనుమానాస్పదంగా వుండేది. అటువంటిది, నా ప్రయాణం ఖరారయ్యింది. నిశ్చయమైన నీ ప్రయాణం తప్పిపోవడానికి కారణం యేవిటి?" విస్తుపోతూ అన్నాడు, ముకుందం.

" నా ఆరోగ్యం బావుండటం లేదు ముకుందం.." ముక్తసరిగ చెప్పాడు, సీతారామయ్య.

అది, నిజమైన కారణం అయ్యుండక పోవచ్చుననిపించింది, ముకుందంకి, అతను చెబుతున్న ధోరణి బట్టి.

" నేన్నమ్మను సీతారామయ్యా! నీ ఆరోగ్యంలో లోపమేం లేదు. వేరే కారణం యేదో వుంటుంది. నా దగ్గర దాపరికం యెందుకు చెప్పు?" చనువుగా అన్నాడు, ముకుందం.

"సీతారామయ్య, మళ్ళి ఓ నిశ్వాసం వదిలాడు.

"అవులిస్తే, పేగులు లెక్కబెట్టేలా వున్నావయ్యా నువ్వు నీ అనుమానం కరక్టే! సమయానికి, మా అబ్బాయికి డబ్బు దొరకలేదు. అదనంగా యేవేవో ఖర్చులొచ్చి పడుతున్నాయి. సంపాదిస్తున్నవాడు, వాడొక్కడే. వాడే, నాకోసం డబ్బు సంపాదించడానికి పడుతోన్న యాతనల్ని చూసి, నాకే బాధనిపించింది. పుణ్యం, పురుషార్థం, లేకపోతే పోయే- అని నేనే ఓ నిర్ణయానికొచ్చి నా ప్రయాణానికి స్వస్తిచెప్పాను. పోనీ నువ్వు వెళ్ళొచ్చేయ్ ముకుందం." అన్నాడు, సీతారామయ్య.

ముకుందం, నిరాశతో దిగాలు పడ్డాడు. తాను ఒంటరిగా వెళ్ళడమన్నది సాధ్యంగాని పని. అందుబాటుకి వచ్చిందనుకున్న యీ అవకాశం, యిలా చేజారిపోయినందుకు, యెంతగానో బాధపడ్డాడు లోలోన. అయితే సీతారామయ్య ఆలోచించిన విధంగా తానెందుకు ఆలోచించలేకపోయాడో నన్న సందిగ్ధ, అతణ్ణి బాధపెట్టింది. కొడుకు కనకరాజు, తనకివ్వడానికి తీసుకొచ్చినపైకం సంపాదించడానికి, యెన్ని ప్రయత్నాలు చేశాడో. తనకి తెలీదుకదా! సీతారామయ్య కొడుకులానే, తన కొడుకు పరిస్థితి వుంది. అయినా, సీతారామయ్యలా తాను ఆలోచించలేకపోయాడు. . . ఎందుకు? అది, అవగాహన లోపమా? . ఆలోచిస్తోన్న ముకుందంకి, యెవరో కడుపులో చేయిపెట్టి దేవుతున్నట్టనిపించింది. అతనూ ఒక నిర్ణయానికొచ్చేశాడు.

"నేనూ వెళ్ళడమనే ప్రసక్తే మరి లేదు సీతారామయ్యా! నువ్వన్నట్టు,

పుణ్యం, పురుషార్థం లేకపోతే పోయె. నేనూ నా ప్రయాణాన్ని విరమించుకుంటాను." అన్నాడు, ముకుందం.

"ముకుందం, నేను చాలా విచారిస్తున్నాను, నా మూలంగా నీ ప్రయాణం కూడా కాన్సిలయినందుకు.." బాధపడుతూ అన్నాడు, సీతారామయ్య.

ముకుందం సన్నగా నవ్వేడు.

"అబ్బే! అలా అనుకోకు సీతారామయ్య! ఇది ఒకందుకు మంచిదే అయ్యిందిలే..."

"మరో విషయం కూడా ఆలోచించాను ముకుందం. ఈ వయసులో మన వాళ్ళందర్నీ యిక్కడ వదిలిపెట్టి, పరభాషా రాష్ట్రంలో, అంతదూరంలో తిరగడం శ్రేయస్కరం కాదని పించింది. మన ఆరోగ్యం, యెప్పుడెలా వుంటుందో, చెప్పలేం కదా!" అన్నాడు, సీతారామయ్య.

"అదీ నిజమే సీతారామయ్య మనం ఒక నిర్ణయానికి వచ్చేశాం కదా! అదే ఫైనల్.." అనేశాడు, ముకుందం.

ఆ తర్వాత, యేవేవో కబుర్లు చెప్పుకుని యింటిముఖం పట్టారు, వాళ్ళిద్దరూను.

* * *

అదే రోజు సాయంత్రం యేడున్నర ప్రాంతంలో శ్రీనివాస్, అతని స్నేహితుడు రవితో నోట్సు పుస్తకాలు కొనడానికని, బజార్లోకి వెళ్ళాడు.

వాళ్ళిద్దరూ భీమరాజు ఎంటర్‌ప్రైజెస్ మీదుగా వెళ్తున్నారు.

కనకరాజు, ఆషాపులో ఓ టేబిలు ముందు కూచుని, యేదో రాస్తూ వుండటాన్ని రవి చూశాడు. . . ఆశ్చర్యంతో అతని కళ్ళింతలయ్యాయి.

"ఒరేయ్ శ్రీని, మీనాన్నారులా వున్నారు.. అక్కడ చూడు అదిగో, ఆ టేబిలు ముందు కూచుని యేదో రాస్తున్నారు చూశావా?" అన్నాడు, రవి.

"ఎక్కడరా?" అటూ, యిటూ చూస్తూ అడిగాడు, శ్రీనివాస్.

"భీమరాజు ఎంటర్‌ప్రైజెస్‌లో. . . అటుచూడు."

శ్రీనివాస్, అటుకేసి చూశాడు. ఔను! అక్కడ కూచుని రాస్తున్నది నాన్నగారే అనుకున్నాడు మనసులో. ఆయన యిక్కడేం జేస్తున్నారో, అతడికి బోధపడలేదు.

"ఔరా రవి, మానాన్నగారే ఇక్కడేం చేస్తున్నారు చెప్మా.." సాలోచనగా అన్నాడు, శ్రీనివాస్.

"బహుశా యిక్కడ పార్టుటైమ్ జాబ్ చేస్తున్నారేమో. ." అన్నాడు, రవి.

ఆ విషయం, శ్రీనివాస్‌కి తెలిదు. "అయ్యుండొచ్చునురా?" ముక్తసరిగ సమాధానం చెప్పాడు, శ్రీనివాస్.

"ఒక మనిషికి, మరో మనిషికి, యెంత వ్యత్యాసం వుంటుందో, చూశావ్రా.." అన్నాడు, రవి.



రవి, యెందకలా అన్నాడో, శ్రీనివాస్‌కి బోధపడలేదు. ఏదో భావన మనసులో వుంచుకునే అలా అని వుంటాడని మాత్రం గ్రహించాడు.

"అంటే, యేవిట్రా నీ వుద్దేశం?" సూటిగ రవికేసి చూస్తూ ప్రశ్నించాడు.

"మీ నాన్నగారు, యెంతో వుత్తములురా శ్రీని. ఆయన యింటి బాధ్యతల పట్ల గౌరవం వుంది. తన బాధ్యతల్ని తీర్చడానికి, శ్రమించడానికి సహితం లెక్క చెయ్యడం లేదు. మా నాన్నారూ వున్నారు. . ఎందుకూ? ఇంటి బాధ్యతల్ని బొత్తిగా పట్టించుకోరు, ఆయన సంగతి మీకెవ్వరికీ తెలిదురా. డబ్బు చేతిలో వుంటే చాలు- తాగి, తందనాలాడుతూ, పేకాటలో యెక్కువ సమయం గడిపేస్తారు. కుటుంబం యెలా వుందో, వాళ్ళ జీవితాలు, నిత్యావసరాలు, యెలా సాగుతున్నాయో నన్న ధ్యాసే వుండదాయనకి. ఆయన గురించి చెప్పుకోడానికి, కొడుకుగా నాకే సిగ్గేస్తోంది. మా ఆర్థిక స్థితి, బాగా దిగజారడానికి కారకులు ఆయనే. ఈవిషయంలో యెవరయినా యేమైనా అన్నారనుకో, యింక చూడు. . యేమేమో దుర్భాషలాడుతూ, గంతులేస్తారు. అందుకే అందరమూ కిక్కురు మనకుండా, నోరుమూసుకుంటాం. ఇదే కారణం

వల్ల, నేను ఎక్స్‌కర్షన్‌కి డబ్బు కట్టలేకపోయాను. ఇప్పుడా అజంతా, ఎల్లోరాలు చూడకపోతేనేం- మన చదువుకి అంతరాయం వుండదవి, నాలో నేనే సమాధానపడి, వూరుకున్నాను. కొన్ని అనుభవాలు, అందరికీ అందుబాటులో వుండవురా శ్రీని." బాధగా చెప్పుకు పోయాడు, రవి.

రవి కళ్ళు చెమర్చిన యేమో, జేబులోంచి రుమాలు తీసి, కళ్ళొత్తుకున్నాడు.

రవి మాటలు, అతడి అనుభూతి శ్రీనివాస్‌ని ఆలోచింప జేశాయి. రవి, వాళ్ళనాన్నగారిని విమర్శిస్తు, తన తండ్రి కనకరాజుని బాధ్యత గల తండ్రిగా వర్ణించి మెచ్చుకుంటున్నాడు. అయితే, తన తండ్రిని, తాను యెంతగా అర్థం చేసుకున్నాడని. ఆయన, తనకి నచ్చజెప్పడానికి చేసిన ప్రయత్నాన్ని పెడచెవిన బెట్టి, యేమేమో అనేశాడు. ఆయనలో అశాంతిని రేకెత్తించాడు. నిజంగా, తన ప్రవర్తన నాన్నగారిని బాధ పెట్టే వుంటుంది. . కలవర పరిచే వుంటుంది. ఎంత తొందరపాటుగా ప్రవర్తించాడు తను?. . అనుకున్నాడు.

శ్రీనివాస్‌లో, పశ్చాత్తాపం పొంగి పొర్లింది. భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు. "రవి, మన యిద్దరం సమ వయస్కులమే అయినా, నీ అవగాహన నాకు లేకపోయింది. నా తొందరపాటుకి పరోక్షంగా యెత్తి చూపి, నాకు కనువిప్పు కలిగించావు. అందుకు, నీకు కృతజ్ఞత చెప్పుకోవాలిరా." అన్నాడు శ్రీనివాస్.

రవి, నిర్ఘాంత పోయాడు, ఆశ్చర్యంగా చూశాడు, శ్రీనివాస్ కేసి.

"ఏవిట్రా నువ్వంటున్నది? నువ్వు నాకు కృతజ్ఞత చెప్పు కోవడం యేవిటి? ఏ సందర్భంలో్రనా? అంతా నాకు అయోమయంగా వుందిరా శ్రీని." కళ్ళింతలు చేసుకుని అన్నాడు, రవి.

"చెప్పుకోడానికే సిగ్గుగా వుందిరా రవి, నా మీద నాకే అసహ్యం వేస్తోంది.

విషయం చెబితే, నా ప్రవర్తనకి నువ్వు హర్షించవు సరికదా, గర్హిస్తావురా. అయినా సరే, నా తొందరపాటు వ్యక్తం చేసి, నా గుండెలోని భారాన్ని దించుకోవాలి." అంటూ, తాను తండ్రితో యేవిధంగా వాదించింది, వివరంగా చెప్పాడు, శ్రీనివాస్.

రవి, మరింత విస్తుపోయాడు, అంత మంచి తండ్రిని అర్థంచేసుకోకుండా, శ్రీనివాస్ యెందుకంత దురుసుగా ప్రవర్తించాడో, వూహించలేకపోయాడు.

"ఎంత తొందరపడ్డావురా శ్రీనీ? నువ్వు చదువుతున్న చదువుకి యిదేనా సార్థకత? నీలో భయభక్తులు బొత్తిగా లేకండా పోయాయా? ఇంతవరకూ, మానాన్న యెదుటికి వెళ్ళడానికే నాకు భయమేస్తోందే? మీనాన్నగారు వుత్తములు, సహృదయులు, ఆలోచనావరులు గనక, నువ్వేం వాదించినా, యెలా వాదించినా, అవధుల్లేని సహనంతో విని, వూరుకున్నారు. అదే మానాన్నగారయితే, యేం జరిగి వుండేదో, వూహించడానికే భయంగా వుంది. నిజం చెప్పాలంటే, యీ నాటి ప్రపంచపు పోకడ అలా వుందిరా శ్రీనీ. మంచివారికి, తగిన గౌరవం, గుర్తింపు, లభ్యం కావడంలేదు. మంచితనం లోపించిన వారికి, అంతా దాసోహమంటారు. అది కేవలం భయం వల్లనేకావచ్చు. ఇదీ ప్రపంచపు రీతి. మరో విషయం శ్రీనీ. మీనాన్నగారు యీషాపులో అదనంగా పన్జేస్తున్నారూ అంటే, అది ఆయన సుఖం కోసం కాదు. ఆయన సుఖాన్ని త్యజించి, కష్టపడుతున్నారంటే. అది కేవలం మీ కుటుంబం కోసమే. అటువంటి వ్యక్తిని పూజించాలిరా.." తమ యింటి పరిస్థితుల్ని దృక్పథంలో పెట్టుకుని అన్నాడు, రవి.

శ్రీనివాస్‌కి, మరింత బాధనిపించింది. రవి చెప్పింది అసత్యం కాదనిపించంది. బాధ్యతల్ని విస్మరించిన రవి తండ్రికంటె, తన తండ్రి యెంతో వున్నతంగా అగుపించాడు. తాను అసభ్యంగా ప్రవర్తించి నందుకు, లోలోన కుమిలిపోయాడు.

"రవి, నా ప్రవర్తన తీరు తప్పేనని, యిప్పుడు తెలుసు కున్నాన్రా! అందుకు నా హృదయము రంపపుకోతకు గురవుతోంది. పరిస్థితుల్ని అర్థం చేసుకోకుండా, వుడుకురక్తం వురకలు వేస్తుంటే, అర్థరహితంగా, అనాలోచితంగా, యేమేమో అనేశాను. మా నాన్నగారు, నాగురించి యేమనుకున్నారో యేమో? ఆయనకి క్షమాపణ చెప్పుకోవాలి." పశ్చాత్తాప్త హృదయంతో అన్నాడు, శ్రీనివాస్.

"మనవి, మధ్యతరగతి కుటుంబాలురా శ్రీనీ మన జీవితాలు, త్రిశంకు స్వర్గాల్లాంటివి. అటు, మీదికి వెళ్ళలేం. . . ఇటు క్రిందికీ దిగలేం. బాగా వెనుకబడిన క్రింది తరగతి వాళ్ళని చూడు. . . యింట్లో వాళ్ళందరూ కష్టపడతారు, స్త్రీ పురుష భేధం లేకుండా, సంపాదిస్తారు, వున్నదాంతో, హాయిగా, తృప్తిగా బ్రతుకునీడుస్తారు. ఇహ, పై తరగతి వాళ్ళ విషయం చెప్పనవసరమే లేదు. వాళ్ళు ఆర్థికపరంగా, సామాజికపరంగా., పై అంతస్తులోనే వుంటారు. వాళ్ళకి, అనువైన అవకాశాలున్నాయి గాబట్టి, వాళ్ళ చదువులూ పై స్థాయిలోనే వుంటాయి. ఎటొచ్చి, మనలాంటి మధ్యతరగతి వాళ్ళకే యిబ్బందులన్నీను? సంపాదించే వాళ్ళు ఒకరిద్దరు అయితే, తినేవాళ్ళెంతోమంది. ఆత్మ గౌరవాన్ని



కాపాడుకునేందుకు, సంఘస్థాయిని నిలబెట్టుకుందుకు, కాస్తంత స్థాయిలో బ్రతకడానికే యత్నిస్తారు. ఆ ప్రయత్నంలో, యెన్నో తాపత్రయాలు.. యెన్నో ఆరాటాలు. ఇలా వుంటుంది జీవితం. తృప్తి అన్నది యేకోశాన వుండదు. అందుకే, మనవి త్రిశంకుస్వర్గాల్లాంటి జీవితాలంటారు." చిన్న వుపన్యాసం యిచ్చినట్టుగా చెప్పుకు పోయాడు, రవి.

రవి, యీ పిన్న వయసులోనే యింతటి పరిజ్ఞానాన్ని, వాక్చాతుర్యాన్ని, యెలా సంతరించుకున్నాడో, శ్రీనివాస్‌కి అవగాహన కాలేదు. తాను కూడా రవి వయస్కుడే అయినా, తనకి యివేమీ తెలీవెందుకుని?... అనుకున్నాడు మనసులో. ఒక విధంగా మనసులో చిన్న బుచ్చుకున్నాడు కూడా.

"రవీ, యి వన్నీ నువ్వెలా చెప్పగలుగుతున్నావురా?" ఆశ్చర్యంగానే అడిగాడు, శ్రీనివాస్.

రవి, చిన్నగా మందహాసం చేస్తూ ఓ నిశ్వాసం వదిలాడు.

" ఇవన్నీ జీవితం నేర్పిన పాఠాలురా శ్రీనివాస్! ఆపైన పుస్తక పరిజ్ఞానం. నేను విపరీతంగా పుస్తకాలు చదువుతానని నీకూ తెలుసునుకదా? పుస్తక పరిజ్ఞానం వూరికనే పోదురా. అందుకనే, పరిస్థితుల్ని అర్థం చేసుకో గలుగుతున్నాను," సన్నగా నవ్వుతూనే అన్నాడు, రవి.

శ్రీనివాస్‌లో ఓ విధమైన మార్పు వస్తోందని, వూహించాడు, రవి. అటువంటి పరిణామం రావడం, యెంతో అవసరమనుకున్నాడు.

" రవీ నీకు యెలా ధన్యవాదాలు చెప్పుకోవడమో, బోధపడ్డం లేదురా. నిశ్చింతగా జీవితం సాగిస్తున్న నాకు, అసలు జీవితమంటే యేవిటో, కొంతయినా బోధపడేలా చెప్పావు. థాంక్సురా. ఎక్స్‌కర్షన్‌కి నేనూ వెళ్ళను." అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేసినట్టుగా చెప్పాడు, శ్రీనివాస్.

రవి, శ్రీనివాస్ కేసి అదోలా చూశాడు.

"అదేంరా! మీ నాన్నగారు డబ్బివ్వడం, దాన్ని నువ్వు మాష్టారు దగ్గర డిపాజిట్ చెయ్యడం జరిగింది కదా? ఇప్పుడిలా మనసు మార్చుకున్నావేమిటి?" అన్నాడు రవి ఆశ్చర్యంగా చూస్తూ.

"ఔన్రా! డిపాజిట్ చేశాను. కాని, ఆ పైకాన్ని మన సరదాలకి వినియోగించ దల్చలేదు. మా నాన్నగారు అన్నట్టు, చదువుకి, యెక్స్‌కర్షన్‌కి సంబంధమే లేదు. ఇదో రకమైన సాధారణ పరిజ్ఞానం మాత్రమే. నేను వెళ్ళక పోయినా, చదువుకి ఒరిగే నష్టమేమి లేదనిపిస్తోంది. ఇప్పుడే వెళ్ళి నేను డిపాజిట్ చేసిన డబ్బు తీసుకుందాం పద."

రవి, మరేం అనలేకపోయాడు. " సరే, నీ యిష్టం..."

శ్రీనివాస్, రవి నేరుగా లెక్చరర్ రామం ఇంటికి వెళ్ళారు, ఆపైకం తిరిగి తీసుకుందుకు.

* *

ఉదయం యేడు గంటలు దాటింది.

కనకరాజు, ఈశ్వర్ వరండాలో కూచుని కాఫీ తీసుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల గురించి మాట్లాడుకుంటున్నారు.

కనకరాజువి, ఫక్తు గాంధియన్ భావాలయితే, ఈశ్వర్‌వి వాటికి భిన్నమైన భావాలు అందుకే, వాగ్వివాద ధోరణిలో సాగుతున్నాయి వారి మాటలు.

ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థని ఈశ్వర్ విమర్శిస్తూ వుంటే, కనకరాజు సమర్థిస్తూ వుంటాడు. ఏ పార్టీ వచ్చినా, పరిపాలనా వ్యవస్థలో సంపూర్ణ పరిణామాలు శాశ్వతంగా రావని, కనకరాజు వాదన. అంతేకాదు-ప్రతిపక్షాలువుండి, యెన్ని విధాలయినా పాలక పక్షాన్ని విమర్శించ వచ్చును. గాని, అవే ప్రతిపక్షాలు పాలనా వ్యవస్థను చేపడితే, విమర్శలకు అతీతులు కాజాలరన్నదే, కనకరాజు సమాధానం.

అటువంటి తరుణంలో, ముకుందం వచ్చాడక్కడికి. ఈశ్వర్, బుద్ధిమంతుడిలా లేచి నుంచున్నాడు.

"కూచోండి మావయ్యగారూ.." అన్నాడు, సవినయంగా.

"నువ్వు కూచోవోయ్.." అంటూ కొడుకుని వుద్దేశించి " అబ్బాయ్, నా ప్రయాణం.." అని యింకేదో చెప్పబోతున్న ముకుందంకి అడ్డు పడ్డాడు, కనకరాజు.

"మీరు కావాలన్న అయిదొందలూ లక్ష్మి చేతికిచ్చాను నాన్నా, అడిగి తీసుకోండి. రిజర్వేషను విషయం త్వరగా చూసుకోండి." అన్నాడు, కనకరాజు.

"ఆ విషయాన్ని చెప్పడానికే వచ్చాన్రా అబ్బాయ్ రాత్రే చెప్పాలనుకున్నాను. కాని, నువ్వు చాలా ఆలస్యంగా వచ్చావు. మరే.. నేనిప్పుడు తీర్థయాత్రలకి వెళ్ళడం లేదురా.." అన్నాడు, ముకుందం.

కనకరాజు, నిర్ఘాంత పోయాడు, అతని మొహంలో, హఠాత్తుగా రంగుమారింది. తండ్రికేసి వింతగా చూశాడు. తను డబ్బు యివ్వడం ఆలస్యమైనందుకే, కోపం తెచ్చుకుని, ప్రయాణం మానుకున్నారేమోనని, బాధపడ్డాడు. "అదేవిటి నాన్నా? మీరు డబ్బివ్వడం ఆలస్యమైందని, సీతారామయ్యగారు తనకోసమే రిజర్వేషను చేయించుకున్నారా యేంటి?" అనుమానాస్పదంగా అన్నాడు. ఒకవేళ అదే జరిగివుంటే, తప్పు తన మీదే పడుతుందని, అతని అభిప్రాయం.

ముకుందం, ముసి ముసి నవ్వేడు. "అదేం కాదులేరా అబ్బాయ్ సీతారామయ్యకి, వీలుపడదట.. అందుకే, అతను ప్రయాణం మానుకుంటున్నాడు. అతను వెళ్ళకపోతే, నాకు తోడెవరుంటారు చెప్పు? అందుకని, నా ప్రయాణాన్ని నేనూ కాన్సిలు చేసుకుంటున్నాను."

"బహూశా, సమయానికి అతనికి పైకం సమకూడలేదేమో మరి?" అన్నాడు ఈశ్వర్.

ముకుందం యేమీ అనలేదుగాని, కనకరాజు అందుకున్నాడు.



"అయ్యుండొచ్చు. ఆ విషయం బైటపెట్టకుండా, వీలుపడదన్న సాకు చెప్పి వుంటాడు. ఏదైతేనేం- మీ ప్రయాణం యిప్పట్లో కాన్సిల్ కావడం, మంచిదే అయ్యింది లెండి నాన్నా. ఎండలు చూస్తే విపరీతంగా వున్నయ్. ఉత్తరభారతంలో అయితే, మరీ అధికంగా వుంటాయి. ఆ వడదెబ్బ తట్టుకోలేక యెంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్టు మనం రోజూ పేపర్లో చూస్తున్నాం. అందుకే, మీ ప్రయాణం తప్పిపోవడం మంచికే అయ్యిందంటున్నాను. అన్నట్టు, యీ విషయం లక్ష్మితో చెప్పేయండి."

ముకుందం, అక్కణ్ణించి వంట గదికేసి దారి తీశాడు.

కనకరాజు మొహంలో, పెద్ద రిలీఫ్ అగుపించింది, ఈశ్వర్‌కి.

" మావయ్యగారి ప్రయాణం తప్పిపోవడం, మంచిదే అయ్యింది బావా." అన్నాడు, ఈశ్వర్.

"ఔను, ముఖ్యంగా, ఆయన యీ వయస్సులో అంత దూరం వెళ్ళడమే నాకు యిష్టం లేదు ఈశ్వర్. కాని, మొదట్లో నేను చెబితే వినలేదు. ఈ విధంగానైనా తప్పింది ప్రయాణం.. మంచిదే అయ్యింది."

"ఎట్లాగయినా, మావయ్యగారు కాస్త పట్టుదల గల మనిషే" చిన్నగా నవ్వుతూ అన్నాడు, ఈశ్వర్.

కనకరాజు, మెల్లగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఏం చేస్తాం ఈశ్వర్. ఎవరి ప్రవృత్తి వారిది, వాళ్ళని మార్చడం అంత సులువేం కాదు."

"అదీ నిజమే బావా!"

కనకరాజు అక్కణ్ణించి లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

* * *

ముకుందం వంటగదికి వెళ్ళేసరికి లక్ష్మి వంకాయలు తరుగుతోంది. వసంత, బియ్యంలో రాళ్ళేరుతుంది.

"అమ్మా, లక్ష్మి.." అంటూ ద్వారం దగ్గరే నిలబడి పోయాడు, ముకుందం.

"ఏవిటి మావయ్యగారూ! మీ అబ్బాయిగారు మీకిమ్మని డబ్బిచ్చారు. అది తీసుకుంటారా యిప్పుడు?" తాను చేస్తోన్నపని ఆపేసి, లేచింది లక్ష్మి. .

ముకుందం, చిన్నగా నవ్వేడు. ఈ మధ్యన వుండే టెన్షను, తనలో యిప్పుడు లేనందుకు చాలా ఆనందించాడు.

"డబ్బు తీసుకోడానికి రాలేదమ్మా వద్దని చెప్పడానికి వచ్చాను.." అన్నాడు, మందహాసంతో,

లక్ష్మి మొహం, ఆశ్చర్యంతో రంగు మార్చుకుంది. బహూశ వేగిరం ఆ పైకాన్ని యివ్వలేదని, కోపం వచ్చిందేమో ఆయనకి?... అది చెప్పడానికి యిష్టంలేక, కృత్రిమమైన చిరునవ్వుతో యీ విధంగా తిరస్కరిస్తున్నారేమో.. అనుకుంది.

"డబ్బు వేగిరం యివ్వలేదని కోపం వచ్చిందా యేవిటి మావయ్యగారు! మీ అబ్బాయి, యెక్కడో యేర్పాటు చేసి తీసుకు రావాలికదా! ఈ అదనపు ఖర్చుల్ని తట్టుకోడానికి యేదో షాపులో సాయంత్రం పూట పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నారు కూడాను.." ఆయన సమస్యల్ని మీరూ ఆలోచించాలి.. పెద్దవారు.." అంది సంజాయిషీ చెప్పుకుంటూ.

ముకుందం, ఓ నిశ్వాసం వదిలాడు. "నువ్వు, నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నావమ్మా లక్ష్మి! నాలో యేవిధమైన కోపమూ లేదమ్మా. నిజానికి, సీతారామయ్య తీర్థయాత్రలకు వెళ్ళడం లేదుగాబట్టి నేనూ విరమించుకుంటున్నానమ్మా. పరిస్థితుల్ని అవగాహన చేసుకోకుండా, తీర్థయాత్రలకు వెళ్తానని పట్టుబట్టడంలో నా తొందరపాటుకు, నేను సిగ్గుపడుతున్నానమ్మా." అన్నాడు, మెల్లగా.

లక్ష్మికి, యేవీ బోధపడలేదు. మావగారు, నిజంగానే ఆ మాటలంటున్నారో లేక కొడుకుఅన్న మాటలకి అభిమానం దెబ్బతిని, అలా అంటున్నారో ఆమె వూహకి అందని విషయమయ్యింది. మావగారికేసి అదోలా చూస్తూ అనబోయేటంతలో, ముకుందమే మళ్ళీ అందుకున్నాడు.

"నిజమేనమ్మా లక్ష్మి! నేను సిగ్గుపడాల్సిన విషయమే. ఎందుకూ అంటే, నాకున్న ప్రాపంచికానుభవాన్ని విస్మరించి తొందరపాటుతో ప్రవర్తించాను. మన కుటుంబంలో, సంపాదిస్తున్నవాడు అబ్బాయి ఒక్కడే. వాడి సంపాదన మీదే, మనం యింతమంది వ్యక్తులం ఆధారపడి వున్నామంటే, అబద్ధం కాదు. నిత్యావసర వస్తువులు, ఆకాశానంటుకుంటున్న యీ రోజుల్లో వాడొక్కడి సంపాదన, మనందరి భుక్తికే సమంగా చాలదేమో! అటువంటి పరిస్థితుల్లో, నేను తీర్థయాత్రలకి వెళ్తానంటూ తయారవ్వడమే, మూర్ఖత్వమేమోనని పిస్తోందమ్మా! ఈ నిజాన్ని నేను ముందుగా గ్రహించలేకపోయాను. సీతారామయ్య కూడా సరిగ్గా యిటువంటి పరిస్థితుల్లోనే యిరుక్కుని, నిజాన్ని అవగాహన చేసుకుని ప్రయాణం మానుకున్నాడమ్మా! వాడు చెప్పేవరకూగాని, నాకు కనువిప్పు కలగలేదు. అందుకే, సిగ్గు పడుతున్నా నంటున్నాను. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, కేవలం సంపాదించేవాడి మీదే వదిలేయడం, దారుణమే అవుతుంది. అందుకనే, అందరమూ విచక్షణతో ఆలోచించాలి. అవగాహన చేసుకోవాలి. అప్పుడే కుటుంబంలో ప్రశాంతత యేర్పడుతుంది. ఈ అవగాహన లేకనే, చాలా కుటుంబాలు ఒడిదుడుకుల్లో పడుతున్నా యేమోనని, యిప్పుడనిపిస్తోంది నాకు. ఇటీవల, ఆర్థిక ఒత్తిడులవల్ల, అబ్బాయి యెంతటి మనోవ్యధకు, ఆందోళనకు గురి అవుతున్నాడో, వాడి





మొహం చూస్తేనే తెలుస్తోందమ్మా. ఇవన్నీ యోచించే, యీ నిర్ణయానికి వచ్చాను." అంటూ సుదీర్ఘమైన తన వివరణని ముగించాడు, ముకుందం.

లక్ష్మి, తృప్తిగ వూపిరి పీల్చుకుంది. మావగారు అటువంటి నిర్ణయాన్ని తీసుకోవడం, శుభ సూచకంగా తోచిందామెకి.

"మావయ్యగారూ, మీరు యిటువంటి నిర్ణయాన్ని తీసుకున్నందుకు, నేనెంతో ఆనందిస్తున్నాను. మిమ్మల్ని అభినందిస్తున్నాను. ప్రస్తుత పరిస్థితిలో మీ యీ నిర్ణయం, యింట్లో అందరికీ చేయూతనిస్తుంది. ఆలోచింపజేస్తుంది. మీ యీ నిర్ణయాన్ని, మీ అబ్బాయిగారితో చెప్పారా?" అంది, లక్ష్మి.

"చెప్పానమ్మా! వాడేమో నీతో చెప్పమన్నాడు."

"మీ అబ్బాయిగారు యెప్పుడూ యింతేలెండి." ముసిముసి నవ్వుకుంది.

ముకుందం, అక్కణ్ణించి నిష్క్రమించాడు. అతని మనస్సు యిప్పుడెంతో ప్రశాంతంగా వుంది.

లక్ష్మి, తన పనిలో నిమగ్న మయ్యింది. వసంత, తన చీర విషయం మరోసారి గుర్తుచెయ్యాలనుకుంది. కాని, తల్లి కోప్పడుతుందేమోననుకుని, వూరుకుంది.

అప్పుడే శ్రీనివాస వచ్చాడు.

"ఇవ్వాళ! కాలేజీ లేదేవిట్రా?" ప్రశ్నించింది లక్ష్మి.

"లేదమ్మా సెలవిచ్చారు.."

"ఏం? ఎందుకు?"

"ఎవరో చనిపోయారటలే.."

"అలాగా! సరేగాని, నీ ఎక్స్‌కర్షన్ ప్రయాణమెప్పుడూ? మీ పిన్ని పెళ్ళికి వుంటావే, లేదా?"

"నా ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నానమ్మా. ఇదిగో నాన్నగారు నాకిచ్చిన రెండువందల రూపాయలూ, యిప్పుడే లెక్చరర్ దగ్గర్నుంచి తీసుకొచ్చేశాను." అంటూ జేబులోంచి డబ్బు తీసి తల్లికి అందించాడు, శ్రీనివాస.

లక్ష్మి, విస్తుపోతూ కొడుక్కేసి చూసింది. ఈవేళ అన్నీ యిటువంటి సంఘటనలే జరుగుతున్నాయేవిటి?.... అనుకుంది.

"ఇదేవిట్రా? ఎవ్వరూ వెళ్ళడం లేదా?" అంది.

"కొందరు వెళ్తున్నారు... కొందరు వెళ్ళడం లేదు. ఆ వెళ్ళని వాళ్ళల్లో నేనూ వున్నానమ్మా.."

"ఏం? ఎందుకని మానేస్తున్నావురా?"

"నాన్నగారు మొదట్లోనే చెప్పారమ్మా, యెక్స్‌కర్షన్‌కి వెళ్ళడం మానుకుంటేకాదా అని! నిజానికి, చదువుకీ, ఎక్స్‌కర్షన్‌కీ సంబంధం లేదని కూడా చెప్పారు. కాని, నా మొద్దు బుర్రకి అప్పట్లో అర్థంకాలేదు. ఏవేవిటో వాదించాను. నిష్ఠూరంగా వాగేను. నాన్నగారి మనస్సు నొప్పించే వుంటాను.



అదనంగా యీ డబ్బు సంపాదించడానికి, నాన్నగారు ఓ షాపులో సాయంత్రం పూట జాబ్‌వర్క్ చేస్తుండటం చూశాను. నా స్నేహితుడు రవి, నాన్నగారి బాధ్యతను, ఆయన మంచితనాన్ని గుర్తించి, యెంతగానో మెచ్చుకున్నప్పుడు గాని, నాన్నగారి ఔన్నత్యాన్ని నేను గుర్తించలేకపోయాను. అప్పుడనిపించింది, ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళకపోతేనేం? అని! రవి, మరికొందరు విద్యార్థులూ వెళ్ళడం లేదు. వాళ్ళందర్నీ చూశాక, నేనీ నిర్ణయానికొచ్చానమ్మా. నువ్వు లేవుగాని, నాన్నగారి సమక్షంలో ఆరోజు యెందుకలా ప్రవర్తించానో, తల్చుకుంటే నాకే సిగ్గుగా వుందిప్పుడు. అందుకే, ఆయనెదుటికి వెళ్ళడానికి ధైర్యం చాలక, యీ డబ్బు నీకే యిస్తున్నాను.." అన్నాడు, శ్రీనివాస.

శ్రీనివాస మాటల్లో పశ్చాత్తాపం ద్యోతక మౌతోంది.

లక్ష్మి మొహంలో, సంతృప్తి ఛాయలు ముసురుకున్నాయి. ఆమె కనుకొనల్లో ఆనంద బాష్పాలు గిర్రున తిరుగుతున్నయ్. కొడుకులో యిటువంటి అవగాహన రావడం, తమ అదృష్టమే అనుకుంది.

"చాలా మంచిపని చేశావురా శ్రీని! బాధ్యత గల యింటి యాజమానిగా మీనాన్నగారు యెన్ని యిక్కట్లు పడుతున్నారో, మనందరం అర్థం చేసుకోవాలి." అంది, తృప్తిగా.

అప్పుడే కనకరాజు, ఈశ్వర్, అక్కడికి వచ్చారు.

"పిలుస్తూ వుంటే, యెవ్వరూ పలకరేం లక్ష్మి? ఏవిటీ కాన్ఫరెన్సూ?" అన్నాడు, కనకరాజు చిరునవ్వుతో.

లక్ష్మి, మెల్లగా నవ్వింది.

"కాన్ఫరెన్సు కాదండీ, అబ్బాయి, మీరు వాడికిచ్చిన రెండొందలూ తిరిగి యిచ్చేశాడు, వాడు యెక్స్‌కర్షన్‌కి వెళ్ళడం లేదట..." అంటూ తన చేతిలో వున్న రెండువందలూ భర్తకి అందించింది.

కనకరాజు మొహం, ఆశ్చర్యంతో తెల్లబోయింది. ఆరోజు యెన్నో మాటలన్న కొడుకు హఠాత్తుగ యిలా మారిపోవడానికి కారణం యేవిటా, అని ఆలోచించసాగాడు.

"ఏంరా శ్రీనూ, యేమయ్యింది?" అన్నాడు, కనకరాజు కొడుకుకేసి చూస్తూ.

శ్రీనివాస, సిగ్గుతో మొహం దించేసుకున్నాడు.

"వెళ్ళడం లేదు నాన్నగారూ! నా స్నేహితులు కూడా కొందరు వెళ్ళడం లేదు , వాళ్ళతో పాటే నేనూను. ఆరోజు మీరు చెబితే, నేను వినిపించుకోలేదు. అర్థరహితంగా వాదించాను. మీ మనసుని నొప్పించాను. అందుకు, నేను యెంతో బాధపడుతున్నాను. ఈ రెండువందలూ వుంటే, మరో ముఖ్యమైన అవసరానికి అక్కరకొస్తాయనుకున్నాను యిప్పుడు." అన్నాడు శ్రీనివాస, యెంతో బాధ్యత గుర్తించిన వాడిలా.

కనకరాజు మొహంలో, కొంతకాంతి మెరిసింది.

"ఇప్పటికయినా, నీలో యిటువంటి మార్పు వచ్చినందుకు యెంతో ఆనందిస్తున్నా(నా అబ్బాయ్.." అన్నాడు కనకరాజు.

వసంతకి, మంచి అదను దొరికినట్టనిపించింది.

"అమ్మా, నా చీర గురించి నాన్నగారికి చెప్పవే.." గుర్తుచేస్తూ అంది, వసంత.

"నాకు గుర్తుందిలే అమ్మా, ఇవ్వాళ సాయంత్రమే బజారుకి వెళ్దాం.." హామీ యిచ్చాడు. కనకరాజు.

వసంత, మురిసిపోయింది. ఆడవాళ్ళకి, కొత్త బట్టలంటే, యెంత ఆనందమో, ఆమె మొహం అప్పట్లో చూసిన వాళ్ళకి తెలుస్తుంది.

బైట సైకిలు గంట ఒకటేపనిగా మ్రోగుతూవుంటే.. శ్రీనివాస్ వెళ్ళాడు.

టెలిగ్రామ్ మెసెంజరిచ్చిన టెలిగ్రామ్ తీసుకుని, దాన్ని చదువుకుంటూ వస్తున్నాడు, శ్రీనివాస్.

టెలిగ్రామ్‌ని చూడగానే, కంగారు పుట్టింది, కనకరాజుకి, అది సహజమేమరి.

"ఎక్కణ్ణుంచిరా ఆ టెలిగ్రామ్?" ఆత్రంగా ప్రశ్నించాడు.

"అత్తా, మావయ్యా, రేపు మధ్యాహ్నం బండిలో వస్తున్నారట నాన్నా.." అంటూ తండ్రి చేతికి అందించాడు, టెలిగ్రామ్.

"అంతేకదా! ఏవిటోనని కంగారు పడ్డాను. టెలిగ్రామ్ అంటేనే భయమేస్తుంది. చూశావా ఈశ్వర్, యేదో ఒక ఖర్చు తప్పిందంటే, మరో ఖర్చు తాజాగా యెదుట నిల్చుంది. మధ్య తరగతి బ్రతుకులంటే, యిలాగే వుంటాయోయ్. ఎక్కడికక్కడ అడ్డొస్తువుతూ బ్రతుకును యీడ్చుకురావడమే, మధ్యతరగతి కుటుంబాలు అలవర్చుకోవల్సిన స్వభావం. అదీ చిరునవ్వుతోనే అందుకే మనలో యెన్ని బాధలున్నా సమస్యలున్నా, వూరికే కంగారు పడిపోము. కృత్రిమమైన మందహాసం, యెప్పుడూ పెదాలపై లాస్యం చేస్తూనే వుంటుంది. అదే మన గొప్పతనం." అన్నాడు. చిన్నగా నవ్వుతూ, కనకరాజు ముందుగదిలోకి నడుస్తూ.

ఈశ్వర్, బావని అనుసరించాడు.

శ్రీనివాస్, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

లక్ష్మి, వంటపనిలో నిమగ్నమయ్యింది.

వసంత, సాయంత్రం తాను కొనబోయే చీర గురించి కలలుగంటోంది.

* * *

Edited, Printed and Published by B. Venkata Rayudu From 1-8-519/11 Chikkadapally, P.B.No.1824, Hyderabad, Phone 64104.
Printed at Mahesh Proces, Phone : 864327





# రాష్ట్రంలో నవశకానికి నాంది



ఆంధ్రప్రదేశ్ ప్రజల విశ్వాసాన్ని చూరగొని, గౌరవాభిమానాలను అందుకుని, ఇటీవలి ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, రాష్ట్ర పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రభుత్వం

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారి సమర్థవంతమైన సారథ్యంలో

రాష్ట్ర ప్రజల సర్వతోముఖ వికాస వైభవాలకు, బడుగు జనుల సంక్షేమ, సేవలకు, రాష్ట్ర ప్రగతికి పూర్తిగా అంకితమై నిర్మాణాత్మక కార్యక్రమాలతో కార్యాచరణకు నడుం బిగించింది.

అభివృద్ధి, సంక్షేమాలనేవి ప్రగతి రథానికి రెండు చక్రాల వంటివని, ఈ రెండూ సక్రమంగా, సమానంగా కదిలినప్పుడే అభ్యుదయ పథంలో పురోగమనం నిరాటంకంగా కొనసాగి, ఆశించిన లక్ష్యాన్ని అనుకున్న వేళకు చేరుకోగలమన్నది రాష్ట్ర ప్రభుత్వ అభిమతం. అందుకే -

రాష్ట్రాభివృద్ధికి అత్యవసరమైన వ్యవసాయం, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, పరిశ్రమల వంటి కీలక రంగాలను మెరుగు పరచి ఇతోధికంగా సత్ఫలితాలను సాధించడానికి

బలహీన వర్గాలకు, మహిళలకు, అల్పసంఖ్యాక వర్గాలకు, వికలాంగులకు సంక్షేమ సేవలను విరివిగా అందించడానికి అత్యధికప్రాధాన్యం యిచ్చి ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే కృషిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమై వుంది.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికై స్వయం ఉపాధి పథకాలకు ప్రాధాన్యమిచ్చి సత్వరం వాటిని అమలు జరిపే కృషిలో రాష్ట్ర ప్రభుత్వం యిప్పటికే ముందడుగు వేసింది.

ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుఖ శాంతులకు నిలయమై, సంపద సమృద్ధికి ఆలవాలమై, అభ్యుదయ పురోగమన కార్యక్రమాలకు నిలయమై రాష్ట్రం సర్వతో ముఖంగా అభివృద్ధి చెందడానికి రంగం సిద్ధమైంది.

